



# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - ఆదివారం 23 మార్చి 2025 | సంపుటి:9 | సంచిక:87 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA| HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |


**26 బంతుల్లో 3 సిక్సులు, 4 ఫోర్లు**



ఈడెన్ గార్డెన్స్‌లో ఐపీఎల్ ఇనాగ్యురల్ మ్యాచ్ 2

## ఆర్థిక శాఖపై చంద్రబాబు సమీక్ష

**అధికారులకు కీలక సూచనలు**



ఆర్థిక శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై సంబంధిత అధికారులతో సీఎం చర్చించారు. కేంద్ర పథకాలు, ఢిల్లీ నుంచి రావాల్సిన నిధులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ శాఖల నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు వెంటనే వచ్చేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. సకాలంలో నిధులు విడుదలయ్యేలా చూడాలన్నారు. కేంద్ర పథకాలకు సంబంధించి 5 శాఖల నుంచి నిధులు రావాల్సి ఉందని ఈ సందర్భంగా అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా రాష్ట్రానికి నిధులు తెచ్చుకోవాలన్నారు.

## శుక్లాకు జ్ఞానపీఠ్

అత్యున్నత పురస్కారానికి ఎంపికైన 12వ హిందీ రచయితగా, ఛత్తీస్‌గఢ్ తొలి రచయితగా రికార్డు

అవార్డు కింద రూ.11 లక్షల నగదు, సరస్వతి దేవి కాంస్య విగ్రహం బహూకరిస్తారు



**ఢిల్లీ:** ప్రముఖ హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లా 2024 జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపికయ్యారు. జ్ఞానపీఠ్ అవార్డుల ఎంపిక కమిటీ శనివారం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. ఈ అవార్డుకు ఎంపికవడం ద్వారా శుక్లా ఒక రికార్డును సృష్టించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి ...మిగతా 2లో

## ఇప్పటికైనా జగన్ అది తెలుసుకుంటే మేలు: లోకేశ్

**అమరావతి:** ప్రభుత్వం శాశ్వతం.. రాజకీయాలు ఎన్నికలకే పరిమితమని ఇప్పటికైనా జగన్ తెలుసుకోవాలని మంత్రి నారా లోకేశ్ హితవు పలికారు. ప్రభుత్వం మారినా.. అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగించడం సంప్రదాయమన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని గతంలో జగన్ విధ్వంస పాలనతో బ్రేక్ చేశారని విమర్శించారు. ''2019లో జగన్ అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వ బకాయిలు చెల్లించనని మొండికేశారు. తెదేపా హయాంలో ప్రారంభమైన అభివృద్ధి పనులను నిలిపేశారు. మరికొన్ని ధ్వంసం చేశారు. ఇలాంటి నిరంకుశ మనస్తత్వం ప్రజాస్వామ్యానికి ప్రమాదం. మేం అధికారంలోకి రాగానే జగన్ పెట్టిన బకాయిలు చెల్లించాం. ఆర్థిక ఇబ్బందులున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేశాం. విద్యార్థులు, తల్లిదండ్రులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా చేయడమే బాధ్యతగా తీసకున్నాం'' అని లోకేశ్ తెలిపారు.



### ఇకపై ప్రతి శనివారం 'నో బ్యాగ్ డే'

**అమరావతి:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యంగా ఎన్నో చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఇప్పటివరకు నెలలో మూడో శనివారం మాత్రమే ఉన్న 'నో బ్యాగ్ డే'ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతి శనివారం అమలు చేస్తామన్నారు. ఆ రోజు విద్యార్థులకు క్విజ్లు, సమకాలీన అంశాలపై డిబేట్లు, సదస్సులు, క్రీడలు, వివిధ పోటీలు నిర్వహిస్తామని లోకేశ్ తెలిపారు.

## విశాఖ మేయర్‌పై అవిశ్వాసానికి సిద్ధమైన కూటమి నేతలు

**కలెక్టర్‌కు వినతి పత్రం**



**విశాఖ:** విశాఖ మేయ్ప అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కూటమి సభ్యులు సిద్ధం అవుతున్నారు. ఈ మేరకు కూటమి నేతలు పీలా శ్రీనివాసరావు, వెలగపూడి, గణబాబు, గండి బాబ్జి, మరికొంత మంది నేతలు శనివారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఇటీవలే వైకాపాకు చెందిన ఆరుగురు కార్పొరేటర్లు తెదేపాలో చేరిన విషయం తెలిసిందే. నాలుగేళ్ల పాటు మేయర్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టకూడదన్న చట్టం అమల్లో ఉండటంతో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా.. ఇప్పటివరకు అవిశ్వాసం పెట్టలేదు. మార్చి 18తో నాలుగేళ్ల కాలపరిమితి పూర్తవనున్న నేపథ్యంలో మహా విశాఖ నగర పాలక సంస్థ 'మేయర్' పీఠం దక్కించుకోవడానికి కూటమి నేతలు పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలోనే జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు.

## ప్రకృతికి సంఘీభావం

శనివారం రాత్రి 8.30 నుంచి 9.30 మధ్య లైట్లు ఆర్పేసి ఎర్త్ అవర్‌ను పాటించిన ప్రపంచం



2

### 'మీ ఫ్యాన్స్ నన్ను ర్యాగింగ్ చేశారు!'

## ఎంపీ బైరెడ్డి శబరి వ్యాఖ్యలకు పవన్ నవ్వులు

**అమరావతి:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభిమానులపై నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఎంబీబీఎస్ చదివే రోజుల్లో పవన్ ఫ్యాన్స్ తనను ర్యాగింగ్ చేశారని సరదాగా వ్యాఖ్యానించారు. ఆమె మాటలకు వేదికపైనున్న పవన్ సైతం చిరునవ్వులు చిందించారు. పంట కుంటల భూమి పూజ కోసం డిప్యూటీ సీఎం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పూడిచర్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ ఎదుట బైరెడ్డి శబరి గతాన్ని గుర్తు చేసుకున్నారు. జన సైనికులు నిజంగా చాలా గట్టివారని పవన్ అన్నారు. వారు తెగించి పని చేసి కూటమికి అఖండ విజయాన్ని అందించారని ఆయన సమాధానం ఇచ్చారు.

## గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలను పట్టించుకున్న పాపాన పోలేదు: పవన్ కల్యాణ్

**పూడిచర్ల:** సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వ్యవస్థలను పటిష్ఠం చేస్తున్నామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆయన నాయకత్వానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. కర్నూలు జిల్లా పూడిచర్లలో పంట కుంట నిర్మాణానికి పవన్ భూమిపూజ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.55 లక్షల పంట కుంటల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బలమైన, అనుభవజ్ఞులైన సీఎం ఉండబట్టే పల్లె పండుగ విజయవంతమైందన్నారు. ''గెలుపులోనే మనుషులను లెక్కించం.. కష్ట సమయంలోనూ ఎలా ఉన్నారనే చూస్తాం. కష్ట సమయంలో బలంగా నిలబడినందునే విజయం సాధించాం. ఈ విజయం రాష్ట్ర ప్రజలు, యువత, మహిళలకు దక్కుతుంది. కర్నూలు జిల్లాలో రూ.75 కోట్లతో 117 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం చేశాం. జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా 98 శాతం రోడ్ల నిర్మాణం పూర్తయింది. నీటిని నిల్వ చేసుకోగలిగితే ఎలాంటి సమస్య ఉండదు. ...మిగతా 2లో



### ఆ విజయానికి కారణం చంద్రబాబే

**కర్నూలు:** రాష్ట్ర వ్యాప్తంగా 1.55 లక్షల ఫారం పాండ్ నిర్మాణంలో భాగంగా ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామంలో రైతు రాజన్న ...మిగతా 2లో

## రేపట్నుంచి శ్రీవారి 'సిఫారసు' దర్శనాలు

**తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖలపై**

**24 నుండి శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనాలు**



**తిరుమల,మార్చి 22,మనం న్యూస్:** మార్చి 25 మరియు మార్చి 30వ తారీఖుల్లో శ్రీవారి ఆలయంలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలకు శ్రీవారి దర్శనం సోమవారం, మార్చి 24 నుండి అమలులోకి రానుంది. ఇందులో భాగంగా ఆదివారం నాడు సిఫార్సు లేఖలు స్వీకరిస్తామని టీటీడీ ఒక ...మిగతా 2లో

## 'నైరుతి'లో సాధారణ వర్షపాతమే



**విశాఖపట్నం:** దేశంలో వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేవి నైరుతి రుతుపవనాలే. దేశంలో ఏడాదిలో కురిసే మొత్తంవర్షపాతంలో 70శాతం ఈ సీజన్ 4నెలల్లోనే కురుస్తోంది. అంతటి ప్రాధాన్యం కలిగిన నైరుతి సీజన్ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల ...మిగతా 2లో

### వర్గీకరణపై చంద్రబాబుకు, జగన్‌కు..

## ఆకాశానికి, భూమికి ఉన్నంత తేడా



2


## విశాఖలో రసవత్తర రాజకీయం

**విశాఖపట్నం:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీకి చుక్కలు కనిపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా విశాఖపట్నంలో రాజకీయాలు రంజుగా మారుతున్నాయి. నెక్స్ట్ ఏం జరుగుతుందో అన్న ఉత్కంఠ మొదలైంది. వైసీపీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారిపై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి కూటమి పార్టీలు సిద్ధమయ్యాయి. ఈ రోజు మధ్యాహ్నం 3 గంటలకు కూటమి నేతలు జిల్లా కలెక్టర్కు అవిశ్వాస తీర్మానంపై నోటీస్ ఇవ్వనున్నారు. కొద్దిరోజుల క్రితమే మేయరుపై అవిశ్వాసం పెట్టడానికి టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు సంతకాలు సేకరించారు. టీడీపీ అధిష్టానం ఆదేశాల మేరకు నగర ఎమ్మెల్యేలు జీవీఎంసీ మేయర్ పీఠాన్ని దక్కించుకునే దిశగా వ్యూహాలు రచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వైసీపీ మేయరుపై అవిశ్వాసానికి సర్వం సిద్ధం అయింది. ...మిగతా 2లో

### ఆన్‌లైన్ మనీ గేమింగ్ సంస్థల

## బ్లాక్

- 2400 బ్యాంకు ఖాతాల సీజ్
- గేమింగ్ ప్లాట్ ఫారమ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీజీజీఐ సూచన



2




## నా భర్త 70 గంటల కంటే ఎక్కువే పని చేశారు

- ఆ రంగాల్లోని వారు 90 గంటలు చేస్తున్నారు
- ఇష్టంతో చేస్తే సమయ పరిమితి ఉండదు
- ఇన్ఫోసిస్ నారాయణమూర్తి 70 గంటల పని వ్యాఖ్యలపై స్పందించిన సుధామూర్తి



### పని గంటల పంచాతి

**ఢిల్లీ:** ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నారాయణమూర్తి ఇటీవల పని గంటలపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. దీనిపై పలువురు విభిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తుండడం.. దేశవ్యాప్తంగా చర్చలు, వివాదాలు కొనసాగుతున్న నేపథ్యంలో తాజాగా దీనిపై నారాయణ మూర్తి సతీమణి,రాజ్యసభ ఎంపీ సుధామూర్తి స్పందించారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఏదైనా పనిని ఇష్టంతో, ఉత్సాహంగా చేయాలనుకుంటే సమయం ఎప్పుడూ పరిమితంగా మారదని ఆమె వ్యాఖ్యానించారు. 'ప్రజలు ఏదైనా పనిని ఇష్టంతో, ఉత్సాహంగా చేయాలనుకుంటే దానికి సమయం ఎప్పుడు పరిమితిగా మారదు. నా భర్త డబ్బులు లేని సమయంలో కూడా ఇన్ఫోసిస్‌ను నిర్మించాలని నిర్ణయించుకున్నారు. అప్పుడు అంకితభావం ...మిగతా 2లో



మనం Manam



## గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలను పట్టించుకున్న పాపాన పోలేదు: పవన్ కల్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

వర్షాలు రాగానే పంట కుంటలు నిండేలా ప్రణాళికలు చేస్తాం. గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలను పట్టించుకున్న పాపాన పోలేదు. వాటిని పూర్తిగా నిర్వీర్యం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ కింద సొంత గ్రామాల్లోనే పనులు కల్పించాం. ఉపాధిహామీ కింద ఇప్పటి వరకు రూ.9,597 కోట్లు ఖర్చు చేశాం. ప్రజలకు ఉపాధి, ఆర్థిక స్థిరత్వం కల్పించాలనేది కూటమి ప్రభుత్వం లక్ష్యం. వంద మందికిపైగా నివసిస్తున్న గిరిజన గ్రామాల్లో రహదారి సౌకర్యం కల్పించాం. విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులకు నిధులు కేటాయించాం'' అని పవన్ అన్నారు.

## ఆకాశానికి, భూమికి ఉన్నంత తేడా

**అమరావతి:**ఎస్సీ వర్గీకరణను మాజీ ముఖ్యమంత్రి జగన్ సమర్థిస్తున్నారో లేదో చెప్పాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రశ్నించారు. వైకాపాలో మాలల ఆధిపత్యం కోసం మాదిగలను అణగదొక్కుతున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి ఆదిమూలపు సురేశ్ మాటలే దీనికి నిదర్శనమన్నారు. ఎస్సీ వర్గీకరణలో చంద్రబాబు, జగన్‌కు ఆకాశానికి, భూమికి ఉన్నంత తేడా ఉందని వాఖ్యానించారు.

## విశాఖలో రసవత్తర రాజకీయం

(మొదటి పేజీ తరువాయి)

**కూటమికే బలం..**

విశాఖ నగరంలో మొత్తం 98 కార్పోరేటర్ స్థానాలు ఉన్నాయి. వంశీ కృష్ణ ఎమ్మెల్యేగా గెలుపొందటంతో ప్రస్తుతం 97 మంది కార్పొరేటర్లు ఉన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ తరపున 29 మంది కార్పోరేటర్లుగా గెలిచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 11 మంది వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చారు. జనసేనకు ముగ్గురు కార్పోరేటర్లు ఉండగా..వైసీపీ, స్వతంత్ర కార్పోరేటర్లు ఏడుగురు జనసేనలో చేరారు. బీజేపీ నుంచి ఒకరు కార్పోరేటర్గా గెలవగా.. వైసీపీ నుంచి ఒకరు చేరారు. సోమవారం మరో తొమ్మిది మంది టీడీపీలో చేరడానికి సిద్ధమయ్యారు. వీరితో పాటు విశాఖపట్నం, అనకాపల్లి కూటమి తరపున గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు కలుపుకుని 109 ఓట్లకుగాను, కూటమి బలం 73కు చేరింది. సీపీఐకి చెందిన స్టాలిన్, ముత్తంశెట్టి కూతురు కూటమికే మద్దతు ఇచ్చే అవకాశం ఉంది.

## శుక్లాకు జ్ఞానపీఠ్

(మొదటి పేజీ తరువాయి)

ఈ అత్యున్నత సాహిత్య పురస్కారాన్ని అందుకున్న మొదటి రచయితగా ఆయన రికార్డులకెక్కారు. భారతీయ సాహిత్యానికి అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా 'జ్ఞానపీఠ్ అవార్డు'ను అందజేస్తారు. 1944లో ఏర్పాటైన ఈ పురస్కారాన్ని.. దేశంలోనే అత్యున్నత సాహిత్య గౌరవంగా పరిగణిస్తారు. ఈ అవార్డుకు ఎంపికైన 12వ హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లా. ఈ పురస్కారం కింద రూ.11 లక్షల నగదు, సరస్వతి కాంస్య విగ్రహాన్ని అందజేస్తారు. హిందీ సాహిత్యం, విలక్షణమైన రచనా శైలికి ఆయన చేసిన అద్భుతమైన కృషికిగానూ ఈ అవార్డు వరించింది. 1999లో ఆయన సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. ఇక గత ఏడాది ఉర్దూ కవి, సినీ గేయరచయిత గుల్జార్, సంస్కృత పండితుడు జగద్గురు రామభద్రాచార్య ఈ పురస్కారాన్ని అందుకున్న విషయం తెలిసిందే.

## ప్రకృతికి సంఘీభావం

**హైదరాబాద్, మార్చి 22:** సుస్థిర భవిష్యత్ కార్యక్రమాల్లో ఒకటి 'ఎర్త్ అవర్' కార్యక్రమం. 'భూ గంట'ను పాటించి ప్రకృతికి సంఘీభావం తెలపాలన్న ఐరాస నిర్ణయం మేరకు ప్రతి ఏటా మార్చి 22న ఎర్త్ అవర్ ను జరుపుకుంటున్నాం. ఈ క్రమంలోనే శనివారం రాత్రి 8.30 నుంచి 9.30 వరకు గంట పాటు లైట్లు బంద్ చేసి ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఈ కార్యక్రమాన్ని జరుపుకున్నారు. ఇలా ఒక్క గంట పాటు అన్ని లైట్లను ఆపేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణ ఉద్యమానికి ఎంతో తోడ్పాటునిచ్చారు. పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరికి వారి బాధ్యతను గుర్తెరిగేలా చేసింది.



# ఆ విజయానికి కారణం చంద్రబాబే

(మొదటి పేజీ తరువాయి)

పొలంలో ఫాం పాండ్ నిర్మాణ పనులకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భూమి పూజ చేశారు. అనంతరం పూడిచెర్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. దేశం మొత్తం ఏపీ వైపు చూస్తోందన్నారు. కష్ట సమయంలో కూటమిని గెలిపించారని.. 175 సీట్లలో 164 సీట్లు కూటమికి ఇచ్చారన్నారు. ఎన్డీయే కూటమిని 21 ఎంపీ స్థానాల్లో గెలిపించారని తెలిపారు. ఏపీ వ్యాప్తంగా పల్లె పండుగ విజయవంతం కావడానికి అనుభవజ్ఞుడైన చంద్రబాబే కారణమన్నారు. రాష్ట్రం బాగుండాలని సీఎం చంద్రబాబు కోరుకుంటారని.. ముఖ్యమంత్రి స్ఫూర్తితోనే తాను పనిచేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

జాతీయ ఉపాధి హామీ పథకానికి ప్రధానంగా కావాల్సింది కష్టపడి పనిచేయడమే అని తెలిపారు. రాయలసీమలో నీటి కష్టాలు అధికంగా ఉండేదన్నారు. భారీ వర్షాలు పడితే నీటి నిల్వ సౌకర్యం రాయలసీమలో లేదన్నారు. మే నెలలోపు లక్షా 55 వేల నీటి కుంటలు పూర్తి అవ్వాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వర్షాల సమయంలో లక్షా 55 వేల నీటి కుంటలు నిండితే ఒక టీఎంసీ నీళ్లు వస్తాయన్నారు. శ్రీకృష్ణదేవరాయలు చెప్పినట్లు రాయలసీమ రతనాల సీమ అవ్వాలన్నారు. అభివృద్ధి కొందరికే పరిమితం కాదని.. అందరికీ కావాలన్నారు. ఒకే రోజు 13326 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించామని చెప్పుకొచ్చారు. పని చేసే సత్తా ఉందని.. పని కోసం దిశానిర్దేశం చేసే ఏ స్వార్థం లేని వ్యక్తులు కావాలన్నారు. రాష్ట్రం బాగుండాలని సీఎం కోరుకున్న విధంగా.. ఆయనను ప్రేరణగా తీసుకుని తనకు ఇచ్చిన శాఖలను బలంగా చేయాలని ఒకే రోజు 13326 గ్రామసభలు నిర్వహించి.. అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనుల జాబితాను రూపొందించి ప్రపంచ రికార్డు సాధించామన్నారు.

పంచాయతీరాజ్ పరిపాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చేందుకు మంత్రివర్గం పరిపాలనా సంస్కరణలను ఆమోదించిందన్నారు. గ్రామీణ ప్రజల జీవితాన్ని మెరుగుపరిచేందుకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చామన్నారు. రాష్ట్రంలో 52.92 లక్షల కుటుంబాల్లో 97.44 లక్షల మందికి ఉపాధి కూలీలకు స్వగ్రామాల్లో ఉపాధి కల్పించామన్నారు. ఈ పథకం కింద రూ.9.5 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ప్రజలకు ఉపాధి ఆర్థికత స్థిరత్వం కల్పించేందుకు చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఒక అడుగు ముందే ఉంటుందన్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో 4వేల పైచిలుకు రోడ్లు మాత్రమే నిర్మించారని, ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలల్లోనే దాదాపు 4వేల కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం జరిగింది. రూ.1600 కోట్ల వ్యయంతో రోడ్లను నిర్మించినట్లు చెప్పారు. 100 మందికిపైగా ఉన్న గిరిజన గ్రామాల్లో రహదారి సౌకర్యం కల్పించామన్నారు. గిరిజన గ్రామాల్లో విద్యుత్, తాగునీరుతో పాటు మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. లక్షా 55 వేల పంట కుంటలు నిండితే మనకు ఇబ్బంది ఉండదని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు.

# రేపట్నుంచి శ్రీవారి 'సిఫారసు' దర్శనాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, ఇదివరకే టీటీడీ ప్రకటించిన విధంగా ఈనెల 30వ తారీఖున శ్రీ విశ్వావసు నామ సంవత్సర తెలుగు ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని మార్చి 25వ తారీఖున మంగళవారం నాడు శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనున్న నేపథ్యంలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయబడ్డాయి. ఈ కారణంగా మార్చి 25వ తేదిన వీఐపీ బ్రేక్ దర్శనం కొరకు మార్చి 24వ తారీఖున ఎటువంటి సిఫార్సు లేఖలు స్వీకరించబడవని భక్తుల స్పష్టత కొరకు మరోసారి



తెలియజేయడమైనది. అదేవిధంగా ఇప్పటివరకు సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనానికి గాను ఆదివారం ఆంధ్ర ప్రజా ప్రతినిధుల నుండి స్వీకరిస్తున్న సిఫార్సు లేఖలు ఇకపై శనివారం నాడు (ఆదివారం దర్శనం కొరకు) స్వీకరించబడతాయని కూడా టీటీడీ గతంలోనే స్పష్టం చేసింది. అయితే మార్చి 30వ తారీఖున ఆదివారంనాడు శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ కారణంగా మార్చి 29వ తారీఖున శనివారం నాడు ఎటువంటి సిఫార్సు లేఖలు స్వీకరించబడవని మరోసారి టీటీడీ స్పష్టం చేస్తోంది. ఈ మార్పులను భక్తులు దృష్టిలో ఉంచుకొని టిటిడికి సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

# బాలయ్య రోజుకొకరిని దంచుతారట కదా..

- అసెంబ్లీ లాబీలో మంత్రి కోమటిరెడ్డి హాట్ కామెంట్స్
- కేటీఆర్ తండ్రి చాటు కొడుకు.. హరీష్ మామ చాటు అల్లుడు
- కోమటిరెడ్డిపై స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిర్యాదు



**హైదరాబాద్, మనం బ్యూరో:** సినీ నటుడు, ఏపీ ఎమ్మెల్యే బాలకృష్ణపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. ఆయన రోజుకొకరిని దంచుతారట కదా...అయినా ఆయన సినిమాలు బాగా నడుస్తాయంటూ వ్యాఖ్యానించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా శనివారం మంత్రి కోమటిరెడ్డి లాబీలో తనను కలసిన మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ చేశారు. సినీ నటుడు బాలకృష్ణను ఉద్దేశించి మాట్లాడుతూ ఫోటోలు దిగే సందర్భంగా అభిమానులను ఆయన కొడతారంట కదా....ఆయన సినిమాలు ఎవరు చూస్తారు? బాలయ్య కంటే రోజా తనతోనే ఎక్కువ మంది ఫోటోలు దిగుతారని వ్యాఖ్యానించారు. అయిన ఆయన సినిమాలకు కలెక్షన్స్ భారీగా వస్తాయని అంటూ మంత్రి చమత్కరించారు.

మరోవైపు, అసెంబ్లీలో ప్రతిపక్ష బీఆర్ఎస్ వ్యవహరిస్తున్న తీరుపైనా మంత్రి పలు విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నేతలకు ధరణితో దోచుకుతినడం తప్ప ఏమీ తెల్వదు, వాళ్లకు మాటలతోనే బతకడం అలవాటైంది. కేటీఆర్ తండ్రి చాటు కొడుకు. హరీష్ రావు మామ చాటు అల్లుడు. వాళ్లు కనీసం డిప్యూటీ లీడర్లు కూడా కాదు. అలాంటప్పుడు మేం వాళ్లతో ఏం మాట్లాడుతామని పేర్కొన్నారు. వేముల ప్రశాంత్ రెడ్డి పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారు. ఆయనను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కనీసం గుర్తు కూడా పట్టరని అన్నారు. ఉప్పల్ నారపల్లి ఫ్లై ఓవర్ పనుల వేగవంతం విషయంపై తాను ఇప్పటికే కేంద్ర మంత్రి గడ్కరీతో మాట్లాడానని, త్వరలోనే ఉస్మానియా ఆసుపత్రికి టెండర్లు కూడా పిలుస్తామని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు.

**కోమటిరెడ్డిపై స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిర్యాదు**

మంత్రి కోమటిరెడ్డి వ్యవహారంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిశారు. సభా హక్కుల ఉల్లంఘన కింద నోటీసులు జారీ చేయాలని హరీష్ రావు నేతృత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. కోమటిరెడ్డి మంత్రిగా ఉండి అన్నీ అబద్దాలే చెబుతున్నారనీ, సభను తప్పుదోవ పట్టిస్తున్నారనీ, ఆయనపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను బీఆర్ఎస్ సభ్యులు కోరారు.

# తెలంగాణను దోచుకోనేందుకు గుంటనక్కలొస్తున్నయ్.. జెర పైలం

**రాష్ట్రం సమస్యల సుడిగుండంలో చిక్కుకుంది**




- తెలంగాణకు ప్రధాన శత్రువు కాంగ్రెసే
- ఇక్కడి పాలకులు సరిగా చేస్తలేరని చంద్రబాబు కూటమి రావాలని పత్రికలోళ్లు రాస్తుండ్రు
- యువత అప్రమత్తంగా ఉండాలె.. అధికారం కోసం సింహాల్లా పోరాడాలె
- బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకోవడానికి కొందరు సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఒంటరిగానే మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. బెల్లం ఉన్న దగ్గరకే ఈగలొస్తాయని అన్నారు. నా పాలనలో ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేవని కానీ, ఇప్పుడు అదే తెలంగాణ సమస్యల వలయంలో చిక్కుకుందని వ్యాఖ్యానించారు. 'ఇన్నాళ్ళు లేని నీటి గోస ఇప్పుడెందుకొచ్చినట్టు?బీఆర్ఎస్ హయాంలో అలుగు పారిన గోదావరి ప్రాజెక్టులు, కాంగ్రెస్ పాలన తెచ్చిన కరువుతో.. నేడు చెరువులు కుంటలు అడుగంటి ఎడారిగా మారడం పట్ల కేసీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఎండిన గోదావరి తల్లి కన్నీటి గోసను... కాళేశ్వరం నీళ్ళందక పంటలు ఎండిన రైతన్నల గుండె కోతను.. సభ్య సమాజానికి తెలిపేందుకు.. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అధ్వర్యంలో రామగుండం నుంచి ఎర్రవల్లిదాకా 200 మందితో వారం రోజులపాటు 180 కిలోమీటర్లు సాగిన పాదయాత్రతో కేసీఆర్ ఫాంహౌస్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ముగింపు సభ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవల్లిలో శనివారం జరిగింది. బతకడానికి వచ్చిన పేదలకు.. మన ప్రభుత్వం అండగా నిలిచింది. కానీ, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లను హైడ్రా పేరుతో కూల్చేస్తుంటే?... కేసీఆర్ అన్నా ఎక్కడున్నావు రావే రావే అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. కానీ, నన్ను వోడగొట్టి ఇంట్ల కూర్చోబెట్టింద్రు కదా?.. నేను ఎక్కడికి రావాలె? కత్తి ఒకరికిచ్చి యుద్ధం ఒకరిని చేయమంటే ఎట్లా అయితది? అని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ఎప్పటికైనా పోరాడేది బీఆర్ఎస్ మాత్రమే అని కేసీఆర్ అన్నారు. అందరూ ఒక్కో కేసీఆర్‌లాగా తయారు కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో అధికారం బీఆర్ఎస్‌దేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని పిలుపుని చ్చారు. తెలంగాణకు ప్రధాన శత్రువే కాంగ్రెస్ అని కేసీఆర్ పునరుద్ఘాటించారు.

## సీనియర్లకు ప్రాధాన్యమిస్తేనే అధికారంలోకొస్తం

**హైదరాబాద్,మనం బ్యూరో:** సొంత పార్టీ నేతలపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోమారు ఘాటు వ్యాఖ్యలు చేశారు. త్వరలో రాష్ట్ర శాఖకు కొత్త అధ్యక్షుడిని ప్రకటించనున్నారనీ, అయితే, అధ్యక్షుడి ఎంపిక రాష్ట్ర కమిటీ నిర్వహిస్తే రబ్బర్ స్టాంప్‌గా ఉంటారని వ్యాఖ్యానించారు. శనివారం మీడియాతో మాట్లాడిన రాజాసింగ్ కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునేది రాష్ట్ర కమిటీనా ? లేక జాతీయ నాయకత్వమా ? అని ప్రశ్నించారు. రాష్ట్ర కమిటీ నిర్ణయిస్తే కొత్త అధ్యక్షుడు రబ్బర్ స్టాంప్ మాదిరిగానే ఉంటారు. కొత్త అధ్యక్షుడిని జాతీయ కమిటీ నిర్ణయిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. గతంలో మనం చూసిన అధ్యక్షుడు గ్రూప్ తయారు చేసుకుని పార్టీకి నష్టం చేశారు.

# 'నైరుతి'లో సాధారణ వర్షపాతమే

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో ఈ ఏడాది ఎలా ఉంటుందోననే సమాచారం కోసం అందరూ ఎదురుచూస్తున్నారు. దీనిపై తాజాగా వాతావరణ నిపుణులు స్పష్టత ఇచ్చారు. నైరుతికి సానుకూల పరిస్థితులు ఏర్పడను న్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది నైరుతి సీజన్ తొలి అర్ధభాగంలో సాధారణ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. నైరుతి సీజన్లో వర్షాలపై ప్రతి ఏడాదీ ఏప్రిల్లో భారత వాతావరణ శాఖ అధికారికంగా బులెటిన్ విడుదల చేస్తోంది. ఈ ఏడాది రుతుపవనాల సీజన్లో సాధారణ వర్షాలు కురుస్తాయని, ఆగస్టు వరకూ ఆశాజనకంగా ఉండేందుకు అవకాశాలు కనిపిస్తున్నాయని కొందరు నిపుణులు విశ్లేషించారు. ఇందుకు గల కారణాలను వారు విశ్లేషించారు.

### పసిఫ్పి వాతావరణం కీలకం

నైరుతి రుతుపవనాల సీజన్‌లో మంచి వర్షాలు కురవాలంటే పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు ప్రధాన భూమిక పోషిస్తాయి. గతేడాది డిసెంబరులో పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన బలహీనమైన లానినా ఈ నెలలో మరింత బలహీనపడుతుందని నిపుణులు పేర్కొన్నారు. ఏప్రిల్ నాటికి తటస్థ పరిస్థితులు నెలకొనే అవకాశం 60శాతం ఉందని భారత వాతావరణ శాఖ శాస్త్రవేత్తలు ఇప్పటికే వెల్లడించిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. తరువాత నైరుతి రుతుపవనాలు ప్రవేశించే సమయానికి బలహీనమైన ఎల్నినో వస్తుందని అంచనా వేశారు. ఆగస్టుకల్లా ఎల్నినో కొంచెం బలపడుతుందని, అయితే అది కొంతకాలమే ఉండి నవంబరు, డిసెంబరుకల్లా లానినా తిరిగి బలపడుతుందని అమెరికాకు చెందిన వాతావరణ అంచనా విభాగం అంచనా వేసింది. పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు లానినా ఉన్నప్పుడు సగటు కంటే చల్లగా, ఎల్నినో కొనసాగితే వేడిగా ఉంటాయి. అదే తటస్థ పరిస్థితులు ఉన్నప్పుడు సాధారణంగా ఉంటాయి. వచ్చేనెల నుంచి పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదయ్యే అవకాశం ఉందని, నైరుతి ప్రవేశించే సమయానికి కొంచెం వేడెక్కుతాయని చెబుతున్నారు. పసిఫిక్ మహాసముద్రం నుంచి హిందూ మహాసముద్రం మీదుగా చల్లని గాలులు భారత్లోకి ప్రవేశించడంతో నైరుతి సీజన్లో వర్షాలు కురుస్తాయి. మంచి వర్షాలకు హిందూ మహాసముద్రంలో ఇండియన్ ఓషన్ డైపోల్ పాజిటివ్గా ఉండాలి. ప్రస్తుతం ఐవోడీ పాజిటివ్గా ఉంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని జూన్ నుంచి ఆగస్టు వరకు సాధారణ వర్షాలే కురుస్తాయని అంచనా వేస్తున్నారు.

# ఆన్ లైన్ మనీ గేమింగ్ సంస్థల బ్లాక్

**ఢిల్లీ:** ఆన్ లైన్ మనీ గేమింగ్ సంస్థలపై కేంద్రం కొరడా ఝుళిపించింది. అక్రమంగా నిర్వహిస్తున్న 357 వెబ్ సైట్లను ఆర్థిక శాఖ పరిధిలోని డీజీజీఐ బ్లాక్ చేసింది. ఆ గేమింగ్ సంస్థలకు చెందిన 2400 బ్యాంక్ ఖాతాలు సీజ్ చేసి, రూ.126 కోట్ల డబ్బును ఫ్రీజ్ చేసింది. అలాగే మనీ గేమింగ్ ప్లాట్ ఫారమ్‌ల పట్ల అప్రమత్తం ఉండాలని, వాటిని ఎవరూ వాడొద్దని డీజీజీఐ హెచ్చరించింది. ''సంస్థలను నమోదు చేయకుండా, ఆదాయాలను దాచిపెడుతూ జీఎస్టీ ఎగవేతల వంటి అక్రమాలకు పాల్పడుతున్న చట్టవిరుద్ధమైన ఆన్ లైన్ మనీ గేమింగ్ ప్లాట్ ఫార్మ్‌లపై చర్యలు తీసుకున్నాం. ఆదాయపన్ను శాఖ సమన్వయంతో 357 వెబ్ సైట్లను బ్లాక్ చేశాం'' అని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. వీటితో పాటు బెట్టింగ్, గ్యాంబ్లింగ్ కు పాల్పడుతోన్న సుమారు 700 సంస్థలపై నిఘా ఉంచినట్టు కూడా ఆ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. దేశం వెలుపల ఈ తరహా సంస్థలు నడుపుతోన్న పలువురు భారతీయులపై డీజీజీఐ మరో ఆపరేషన్ చేపట్టింది. వారికి చెందిన 166 ఖాతాలను బ్లాక్ చేసింది. అలాగే ముగ్గురిని అదుపులోకి తీసుకుంది. ''సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లతో పాటు బాలీవుడ్ సెలబ్రిటీలు, క్రికెటర్లు ఈ సంస్థల ప్రచారంలో పాల్గొంటున్నారని గుర్తించాం. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ.. వాటికి దూరంగా ఉండాలి. ఆ ప్లాట్ ఫామ్ లు వ్యక్తుల ఆర్థిక భద్రతను దెబ్బతీయవచ్చు. దేశ భద్రతను దెబ్బతీసే కార్యకలాపాలకు అవి పరోక్షంగా మద్దతు ఇచ్చే అవకాశాలున్నాయి'' అని ఆర్థిక శాఖ ప్రకటించింది.

# నా భర్త 70 గంటల కంటే ఎక్కువే పని చేశారు

(మొదటి పేజీ తరువాయి)

కలిగిన వ్యక్తులతో కలిసి 70 గంటలు అంతకంటే ఎక్కువ సమయం పని చేయడం వల్లే అది సాధ్యమైంది. నా భర్త మాత్రమే కాదు.. జర్నలిస్టులు, డాక్టర్లు వంటి ఇతర రంగాల్లోని వారు కూడా 90 గంటలు పని చేస్తున్నారు. భగవంతుడు అందరికీ రోజుకి 24 గంటల సమయమే ఇచ్చాడు. దానిని మీరు ఎలా వినియోగించుకుంటారు అనేది మీ ఇష్టం' అని సుధామూర్తి పేర్కొన్నారు.

ఈసందర్భంగా ఆమె వ్యక్తిగత జీవితం గురించి కూడా మాట్లాడారు. నారాయణమూర్తి ఇన్ఫోసిస్‌ను చూసుకున్నప్పుడు తాను ఇంటి బాధ్యతలు తీసుకున్నానని ఆమె గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో తాను ఇంటిని చూసుకోవడం, పిల్లలను పెంచడంతో పాటు కళాశాలలో కంప్యూటర్ సైన్స్ బోధించినట్లు తెలిపారు. ప్రస్తుతం తన భర్త కంటే తానే ఎక్కువ సమయం.. ఓవర్ టైమ్ పని చేస్తున్నానని, దానికి ఆయన వెనక నుంచి సపోర్ట్ గా ఉండి ముందుకు నడిపిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి మహిళ విజయం వెనక అర్థం చేసుకునే వ్యక్తి ఉంటారని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా వృత్తి జీవితంలో భార్యాభర్తలు ఒకరికొకరు సాయం చేసుకోవాలని అదే జీవితమని పేర్కొన్నారు.

## కర్ర కాళ్లతో మల్లన్న యాత్ర

ఉగాది సమీపిస్తుండటంతో కన్నడ భక్తులు పాదయాత్రగా శ్రీశైల మల్లన్న దర్శనానికి వెళుతున్నారు. కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు వందల కిలోమీటర్ల పాదయాత్ర చేస్తూ శ్రీశైలానికి చేరుకుంటున్నారు. కొందరు కాళ్లకు కర్రలు కట్టుకుని శివనామస్మరణ చేసుకుంటూ నడుస్తుండగా.. మరికొందరు శివలింగాన్ని పల్లకిలో మోసుకెళుతున్నారు.

## 26 బంతుల్లో 3 సిక్సులు, 4 ఫోర్లు

**కొల్‌కతా:** ఐపీఎల్-2025లో భాగంగా కోల్కతాలోని ఈడెన్స్ గార్డెన్స్‌లో జరుగుతోన్న మ్యాచ్లో కేకేఆర్ బ్యాటర్లు అదరగొట్టారు. సునీల్ నరైన్ 26 బంతుల్లో 44 పరుగులు చేశారు. ఇందులో మూడు సిక్సులు, నాలుగు ఫోర్లు ఉన్నాయి. ఇక కెప్టెన్ అజింక్య రహానే 31 బంతుల్లో 56 పరుగులు చేశారు. ఇందులో నాలుగు సిక్సర్లు, ఆరు ఫోర్లు ఉన్నాయి. ఆ తర్వాత రఘువంశీ చివరి వరకూ పోరాడి 30 పరుగులు చేశారు. దీంతో మొత్తంగా కేకేఆర్ జట్టు.. 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. ఆర్సీబీ గెలవాలంటే 175 పరుగులు చేయాల్సి ఉంది.

# డీలిమిటేషన్‌కు మేం వ్యతిరేకం

- దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపిస్తోంది
- జనాభా ఆధారంగా సీట్లు పెంచడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం
- డీలిమిటేషన్‌పై చెన్నై సమావేశంలో కేటీఆర్



**హైదరాబాద్, మనం ప్రతినిధి:** డీలిమిటేషన్‌పై చెన్నైలో శనివారం నాడు అఖిలపక్ష సమావేశం జరిగింది. డీఎంకే అధినేత, సీఎం స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పలు రాష్ట్రాల సీఎంలు, కీలక నేతలు హాజరయ్యారు. తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ నుంచి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం వాటిల్లుతుందని, డీలిమిటేషన్‌ను ప్రశ్నించని పక్షంలో చరిత్ర తమను క్షమించదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు జరగనున్న అన్యాయంపై చర్చించేందుకు డీఎంకే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సమావేశం అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై అన్ని రాష్ట్రాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు. డీలిమిటేషన్ కారణంగా తెలంగాణలో నియోజకవర్గాల సంఖ్య తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా ఆధారంగా సీట్లు పెంచడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అన్నారు. ఈ విధానాన్ని అవలంబిస్తే అనేక నష్టాలు జరుగుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. దేశాభివృద్ధిలో ముందున్న రాష్ట్రాలకు నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ విధానాన్ని అనుసరించడం ద్వారా అధికారం పూర్తిగా కేంద్రీకృతమై నియంతృత్వం వైపు దారితీసే అవకాశం ఉందని అన్నారు.

**డీలిమిటేషన్‌కు మేం వ్యతిరేకం... దక్షిణాది రాష్ట్రాలకు విలువలేకుండా పోతుంది: కేటీఆర్**

డీలిమిటేషన్ కు తాము పూర్తిగా వ్యతిరేకమని చెప్పారు. డీలిమిటేషన్ తో దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలకే నిధులు ఇస్తామని కేంద్ర ప్రభుత్వం చెపుతోందని... డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు ఏమాత్రం విలువలేకుండా పోయే ప్రమాదం ఉందని చెప్పారు. ఉత్తరాది రాష్ట్రాల్లో ఎంపీ స్థానాలు భారీగా పెరుగుతాయని... అప్పుడు దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం ఎక్కువగా ఆధారపడాల్సిన అవసరం లేదని అన్నారు. దేశ జనాభాలో 2.8 శాతం జనాభా ఉన్న తెలంగాణ... దేశ జీడీపీలో 5.1 శాతం సమకూర్చుతోందని కేటీఆర్ చెప్పారు. ఇప్పటికే అన్ని ట్యాక్స్‌ల పేరుతో తెలంగాణ నుంచి రూపాయి తీసుకుని... 25 పైసలు మాత్రమే తిరిగి ఇస్తోందని విమర్శించారు. డీలిమిటేషన్ తో నిధుల పరంగా దక్షిణాది రాష్ట్రాలు తీవ్ర వివక్షకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

# రాజకీయం కోసం కలియుగ దైవాన్ని వదిలిపెట్టని బాబు

- ఆధ్యాత్మికత, పవిత్రతపై చంద్రబాబుకు నమ్మకం లేదు
- శ్రీవారి సమక్షంలోనే పచ్చి అబద్దాలను అలవోకగా మాట్లాడారు
- మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఫైర్
- శ్రీవాణి ట్రస్ట్ విషం చిమ్మిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్
- ఆలయాల నిర్మాణంకు కొత్తగా మరో ట్రస్ట్ అంటున్న చంద్రబాబు
- మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ధ్వజం

**తిరుపతి, మార్చి 22 మనం న్యూస్ :** తన స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసం కలియుగ దైవం వెంకటేశ్వరస్వామిని సైతం వాడుకునే దౌర్భాగ్యం చంద్రబాబు సొంతమని వైయస్‌ఆర్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. తిరుపతి క్యాంప్ కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడుతూ పరమ పావనమైన శ్రీవారి వారి క్షేత్రంలోనూ పచ్చి అబద్దాలను అలవోకగా చెప్పే చంద్రబాబుకు ఆధ్యాత్మికత, పవిత్రతపై ఎటువంటి నమ్మకం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంకటేశ్వరస్వామి భక్తుడిగా చెప్పుకుంటూ రాజకీయమే పరమావధిగా సనాతన ధర్మాన్ని, స్వామివారి ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరించడం చంద్రబాబు నైజమని ధ్వజమెత్తారు. ఇంకా ఆయనేమన్నారంటే...

దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా తిరుమల అన్నదానానికి విరాళంగా చంద్రబాబు విరాళం ఇచ్చారు. తరువాత మీడియాతో మాట్లాడుతూ పచ్చి అబద్దాలు మాట్లాడారు. గతంలో ఆరోపణలు చేసిన శ్రీవాణి ట్రస్ట్ను కొనసాగిస్తామని ప్రకటించారు. వాస్తవానికి శ్రీవాణి ట్రస్ట్ అనేది ప్రారంభమైందే టీడీపీ ప్రభుత్వంలో. తరువాత అధికారంలోకి వచ్చిన వైయస్‌ఆర్‌సీపీ ఈ ట్రస్ట్ను సమర్థంగా నిర్వహించడం వల్ల దేశ వ్యాప్తంగా 3600 ఆలయాలను ఈ ట్రస్ట్ ద్వారా వచ్చిన నిధులతో నిర్మించడం జరిగింది. అటువంటి ట్రస్ట్‌పైనై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు అనేక తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయనతో పాటు పవన్ కళ్యాణ్కు ఇదే తరహాలో అభాండాలు వేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే శ్రీవాణి ట్రస్ట్ నిధులపై విజిలెన్స్ విచారణ వేసి, ఇప్పటి వరకు ఒక్క చిన్న తప్పును కూడా నిరూపించలేకపోయారు. శ్రీవాణిని రద్దు చేస్తామన్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఈ ట్రస్ట్ గొప్పతనంను గుర్తించి, ట్రస్ట్ ద్వారా విక్రయిస్తున్న టిక్కెట్ల సంఖ్యను కూడా పెంచారు. తాము శ్రీవాణి ట్రస్ట్ విషయంలో చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఇప్పుడు చంద్రబాబు కొత్త నాటకానికి తెర తీశారు. శ్రీవాణి ట్రస్ట్ను కొనసాగిస్తూనే ఆలయాల నిర్మాణానికి మరో ట్రస్ట్ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇది చంద్రబాబు ద్వంద విధానాలకు నిదర్శనం.

**శ్రీవారిని అరకు కాఫీతో ఎలా పోలుస్తారు?**

తిరుమల వెంకటేశ్వరస్వామి, అరకు కాఫీ, కూచిపూడి నృత్యం ఏపీ వారసత్వ సంపద అంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు చాలా దారుణం. కలియుగ దైవాన్ని అరకు కాఫీతో ఎలా పోలుస్తారు? ఇదేనా స్వామివారి పట్ల చంద్రబాబుకు ఉన్న భక్తితత్వం? గతంలో



తిరుమలలో నీటి ఎద్దడి వల్ల శ్రీవారి ఆలయాన్ని మూడు నెలల పాటు మూసివేయాలని అధికారులు తనకు సూచించారని, తాను వ్యతిరేకించడంతో పాటు తొంబై రోజుల్లో నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించకపోతే ఆ అధికారులను అరెస్ట్ చేస్తానని హెచ్చరించినట్లు చంద్రబాబు చెప్పుకున్నారు. ఆలయాన్ని మూసేయాలన్న ఆ అధికారులు ఎవరో చంద్రబాబు బయటపెట్టాలి. ఏ అధికారంతో వారిని అరెస్ట్ చేస్తానని చంద్రబాబు హెచ్చరించారో కూడా వివరించాలి. లేని దానిని ఉన్నట్లుగా సృష్టించి, గొప్పలు చెప్పుకోవడం చంద్రబాబుకు మాత్రమే తెలుసు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రక్షాళనతోనే పాలన ప్రారంభించామని, అందుకే ఈఓగా శ్యామలరావును నియమించామని చంద్రబాబు చెప్పుకున్నారు. శ్యామలరావుతో ప్రక్షాళన ప్రారంభమయ్యిందని అనుకుంటే ఆయనతో సమానస్థాయి ఉన్న అధికారులకు ఎవరికీ కూడా సమర్థత లేదని చంద్రబాబు అంగీకరించినట్లే కదా? ఇదే శ్యామలరావు లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలవలేదని కూడా ప్రకటించారు. ఆయన సమర్థతను చూసిన సీఎం చంద్రబాబు శ్యామలరావు చేసిన ప్రకటనకు భిన్నంగా లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని ప్రకటన చేశారు. ఇదేనా శ్యామలరావుపై మీకున్న నమ్మకం?

**- వైయస్‌ఆర్ హయాం నుంచే శ్రీవారి కొండపై అందరికీ అన్నదానం**

శ్రీవారి దర్శనంకు వచ్చిన వారికే కాదు, కొండపైకి వచ్చిన ప్రతి భక్తుడికి అన్నప్రసాదాన్ని అందించాలనే నిర్ణయం జరిగిందే స్వర్గీయ వైయస్ రాజశేఖరరెడ్డి గారి ప్రభుత్వంలో. అలాగే హిందువులు మాత్రమే స్వామివారి దేవస్థానంలో పనిచేయాలనే నిర్ణయం కూడా వైయస్‌ఆర్ హయాంలోనే తీసుకున్నారు. ఇప్పుడు తామే అన్నప్రసాద విస్తరణకు చర్యలు తీసుకున్నట్లు, హిందువేతరులకు స్థానం ఉండకూడదని నిర్ణయం తీసుకున్నట్లు చంద్రబాబు లేని ఘనతను చాటుకుంటున్నారు. నిజంగా ఆయనకు చిత్తశుద్ధి ఉంటే స్విమ్స్కు టీటీడీ నుంచి అందుతున్న నిధులను నిలిపేయాలనే ట్రస్ట్ బోర్డ్ పెద్దల అభిప్రాయాలను ఎందుకు వ్యతిరేకించడం లేదు? వైద్యసేవ అంటే చంద్రబాబుకు గౌరవం లేదా?

**- టీడీపీ హయాంలోనే హోటళ్ళ నిర్మాణానికి అనుమతులు**

తిరుమలలో ఓబెరాయ్ సంస్థకు హోటల్, దేవలోక్ నిర్మాణాలకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే అనుమతులు ఇచ్చిన విషయం వాస్తవం కాదా? సాధుపుంగవులు ఈ నిర్మాణాలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేయడంతో భయపడిన కూటమి ప్రభుత్వం వాటిని రద్దు చేస్తున్నామని ప్రకటించింది. ఈ నిర్మాణాలకు వైయస్‌ఆర్‌సీపీ ప్రభుత్వమే అనుమతించిందని మాపైన నిందలు మోపుతున్నారు. ఎక్కడైనా దీనిని నిరూపించేందుకు సిద్దం. తిరుమల ఈఓగా ఉన్న ఐఆర్ఎస్ అధికారి కొండపై రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారు. తిరుమలలోని నిర్వాసితులను మీరంతా వైయస్‌ఆర్‌సీపీకి అనుకూలమైన వారు, మీ షాప్లను మూసేయిస్తాను అని బెదిరిస్తున్నారు. చంద్రబాబు మాట్లాడుతూ ఆలయాలను అభివృద్ది చేసి, టూరిస్ట్ లకు అనుకూలంగా మారుస్తామని ప్రకటించడం దారుణం. ఆలయాలను అభివృద్ధి చేసి ఆధ్యాత్మిక వాతావరణాన్ని తీసుకువచ్చి, భక్తులు ఆలయాలను చేరువ చేయాల్సింది పోయి పర్యాటక కేంద్రాలుగా మారుస్తానని చెప్పడం దుర్మార్గం. సామాన్య భక్తులకే శ్రీవారి దర్శనానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పిన చంద్రబాబు దానికి భిన్నంగా రోజుకు ఎనిమిది వేల బ్రేక్ దర్శనాలను వీఐపీలకు ఇస్తున్నారు. సీఎంఓ నుంచే వీఐపీలకు రాచమార్గంలో దర్శనాలను కల్పిస్తున్నారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు సామాన్యులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి కల్పించారని అన్నారు.

# విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై 24 నుంచి ఆందోళన

**తిరుపతి, మార్చి 22 మనం న్యూస్ :** విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24వ తేదీ సోమవారం నుంచి నిరవధిక రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్టు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె కుమార్, పర్మినెంట్ ఉద్యోగుల సంఘం నాయకులు శివప్రసాద్ లు ప్రకటించారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన మీడియా సమావేశంలో నేతలు ప్రసంగిస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. దశాబ్ద కాలంగా విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజేషన్ చేయకుండా వేధిస్తున్నారని , తెలంగాణ తరహాలో డైరెక్ట్ పేమెంట్ ఇవ్వాలని కోరినా పట్టించుకోవడంలేదని తీవ్రస్థాయిలో విమర్శించారు. 2022 పి.ఆర్.సి అరియర్స్ ను 15 సంవత్సరాలుగా వాచ్ అండ్ వార్డులుగా పనిచేసి షిఫ్ట్ ఆపరేటర్లుగా ఉద్యోగోన్నతిని పొందిన వారికి రావలసిన వేతనాలు ఇవ్వకపోవడం, 10 సంవత్సరాల సర్వీసున్న వారికి ఇన్సెంటివ్ ఇవ్వాలని కోరుతూ ఈ ఆందోళనలు కొనసాగుతాయని ప్రకటించారు.




జగన్మోహన్ రెడ్డి, చంద్రబాబు నాయుడు ప్రభుత్వాల వల్ల కాంట్రాక్ట్ కార్మికులకు ఒరిగిందేమీ లేదని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయి కార్మికులు అల్లాడిపోతుంటే వేతనాలు పెంచకుండా కూటమి ప్రభుత్వం వేడుక చూస్తుండటం దారుణమని అన్నారు. పై సమస్యల పరిష్కారం కై చేపట్టబోతున్న నిరాహార దీక్షలు తరువాతి ఆందోళనలను ఉధృతం చేస్తామని వారు ప్రకటించారు. సమస్య తీవ్రత పెరగకముందే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కారం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# శాప్ చైర్మన్ రవినాయుడిని సత్కరించిన నేతలు

**తిరుపతి, మార్చి 22 మనం న్యూస్ :** ఈనెల 18,19,20వ తేదీల్లో విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంల జరిగిన శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు సీఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం కొణెదల పవన్ కల్యాణ్, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడిచే మన్ననలు పొందిన శాప్ చైర్మన్ రవినాయుడుని తిరుపతిలో



స్థానిక ఎమ్మెలే అరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసులు మాట్లాడుతూ క్రీడల నిర్వహణలో రవినాయుడు చూపిన శ్రద్ధ, కృషిని ప్రశంసించారు. కూటమి అధిష్టానం తనకు అప్పగించిన బాధ్యతలను దిగ్విజయంగా పూర్తిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు రాజారెడ్డి, నైనార్ మహేష్ యాదవ్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

# మదనపల్లె నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా అసెంబ్లీలో సమస్యల ప్రస్తావన

- వక్ఫ్ ఆస్తులపై అసంబ్లీలో ప్రత్యేకంగా చర్చ
- ఎమ్మెల్యే షాజహాన్ బాషా

**మదనపల్లి, మార్చి 22, మనం న్యూస్:** మదనపల్లె నియోజకవర్గంలో అభివృద్ధి ధ్యేయంగా పలు సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లి చర్చించడం జరిగిందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. మదనపల్లె లో శనివారం ఉదయం ఎమ్మెల్యే షాజహాన్ బాషా తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.

అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తరువాత మదనపల్లె కు విచ్చేసిన ఎమ్మెల్యే అసెంబ్లీ లో చర్చించిన పలు అంశాలను తెలియజేశారు, నేను మదనపల్లె నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా అసెంబ్లీలో మాట్లాడానన్నారు, పలు అంశాలను స్పీకర్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు గార్ల దృష్టి కి మదనపల్లె అభివృద్ధి కి సంబంధించిన అన్ని ప్రతిపాదనలు వారి ముందు ఉంచాను, వారు



సానుకూలంగా స్పందించారు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ ఆస్తులు , దేవాదాయశాఖ ఆస్తులకు సంబంధించిన విషయాలను చర్చించమని మంత్రి లోకేష్ బాబు సూచించారు, వక్ఫ్ బోర్డు ఆస్తులపై అసెంబ్లీలో నా చర్చలు విన్న స్పీకర్ వెంటనే రూలింగ్ ఇచ్చారు, సంబంధిత శాఖల మంత్రి , మైనారిటీ శాసనసభ్యులు, అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు, త్వరలో వక్ఫ్ బోర్డు ఆస్తులపై ప్రత్యేక చట్టం వస్తుందన్నారు, ఈ చట్టం ప్రకారం ఎవరైనా వక్ఫ్ ఆస్తులు గానీ లేక దేవాదాయశాఖ ఆస్తులు గానీ ఆక్రమించి నా , అక్రమంగా ప్రవేశించినా పీడీ యాక్ట్ నమోదుచేసి శిక్షిస్తారని ఎమ్మెల్యే తెలిపారు, అలాగే ఘణ చరిత్ర కలిగిన మదనపల్లె లోని జామియా మజీద్ కు, మడికయ్యల శివాలయానికి టిప్పుసుల్తాన్ భూములు కేటాయించారు, మదనపల్లె లో రోడ్ల అభివృద్ధి కి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 10 కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తున్నారు,ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అతి పెద్దదైన మూడవ ఆసుపత్రి మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి, రోజుకు 12 వందల నుండి 13 వందల వరకూ ఔట్ పేషెంట్ లు వస్తుంటారు, దీని అభివృద్ధి కి ప్రతిపాదనలు చేశామన్నారు, బీటీ కాలేజీ ని విశ్వవిద్యాలయం చేయుటకు, తాగునీటి అవసరాల కోసం హంద్రీనీవా కాలువ నుండి నీళ్ళు తీసుకొని రానున్నట్లు చెప్పారు, మదనపల్లె నియోజకవర్గం ప్రజల కోసం నిరంతరం నేను అందుబాటులో ఉన్నాను, వారి సమస్యలు పరిష్కారమే నా ధ్యేయం, మదనపల్లె లో ఎన్డీయే కూటమి గెలుపు సహకరించిన ప్రతి కార్యకర్త కు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు, ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ ఛైర్మన్ నాదెళ్ల విద్యా సాగర్, డైరెక్టర్ సర్దార్, ఆర్ జే వెంకటేష్, జేవీఆర్ , బాలు స్వామి, పూల మురళి , బెల్లె రెడ్డి ప్రసాద్ , చిన్న మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తాతయ్యగుంట గంగమ్మ ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన టిటిడి చైర్మన్

**తిరుపతి, మార్చి 22 మనం న్యూస్ :** తిరుపతి శ్రీ తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి భక్తుల రాక పెరుగుతోందని, ఈ ఆలయాన్ని అని విధాల అభివృద్ధి చేస్తామని టీటీడీ చైర్మన్ బీ ఆర్ నాయుడు తెలిపారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చైర్మన్ శనివారం స్థానిక ఎంఎల్ఏ శ్రీ ఆరణి శ్రీనివాసులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మీడియా తో మాట్లాడుతూ, తిరుపతి శ్రీ తాతయ్యగుంట గంగమ్మ తల్లి తిరుమల శ్రీ వేంటేశ్వరస్వామికి సోదరిగా చెబుతారన్నారు. శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనానికి వస్తున్నందున, వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా టీటీడీ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఆలయ పునర్నిర్మాణ పనులలో భాగంగా మొదటి విడతగా రూ.3.75 కోట్లతో అభివృద్ధి జరుగుతున్నాయని చెప్పారు. ఇందులో ఆర్చ్, ఎస్ఎస్ గ్రిల్స్, రాతి ఫ్లోరింగ్, డ్రైనేజ్ తదితర పనుల పురోగతిని చైర్మన్ పరిశీలించి పలు సూచనలు చేశారు. అదేవిధంగా రెండో విడత అభివృద్ధి పనులకు రూ.3.90



కోట్లతో ప్రతిపాదనలు వచ్చినట్లు తెలిపారు. ఇందులో ముఖ మండపం, పోటు, తూర్పు, ఉత్తరం, పశ్చిమ వైపు ప్రాకారాలు, మరుగుదొడ్లు తదితర పనులకు సంబంధించి రాబోవు టీటీడీ బోర్డు సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు. మే 6 నుండి 13వ తేదీ వరకు గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించేందుకు టిటిడి అన్ని విధాల సహకారం అందిస్తుందని తెలిపారు. అంతకుముందు చైర్మన్ శ్రీ తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు జీ. భానుప్రకాష్ రెడ్డి, ఎం. శాంతారాం, సీఈ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 6 నుంచి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు


- ఏప్రిల్ 11న సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు శ్రీ సీతారాముల కల్యాణం
- ఏప్రిల్ 1న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుపతి, మార్చి 22 మనం న్యూస్ :** కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఏప్రిల్ 6 నుండి 14వ తేదీ వరకు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి.

ఇందులో భాగంగా ఆలయంలో ఏప్రిల్ 1న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, ఏప్రిల్ 5న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలలో ప్రతి రోజు ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహన సేవలు జరుగుతాయి.

బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరాలు :

06-04-2025
ఉదయం - ధ్వజారోహణం (ఉదయం 9.30 నుండి 10.15 గంటల వరకు వృషభ లగ్నం)
రాత్రి - శేష వాహనం



07-04-2025
ఉదయం - వేణుగానాలంకారము
రాత్రి - హంస వాహనం
08-04-2025
ఉదయం - వటపత్రశాయి అలంకారము
రాత్రి - సింహ వాహనం
09-04-2025
ఉదయం - నవనీత కృష్ణాలంకారము
రాత్రి - హనుమంత వాహనం
10-04-2025
ఉదయం - మోహినీ అలంకారము
రాత్రి - గరుడసేవ
11-04-2025
ఉదయం - శివధనుర్భాణ అలంకరణ
రాత్రి - కళ్యాణోత్సవము/ గజవాహనము
12-04-2025
ఉదయం - రథోత్సవం
13-04-2025
ఉదయం - కాళీయమర్ధనాలంకారము
రాత్రి - అశ్వవాహనం
14-04-2025
ఉదయం - చక్రస్నానం
రాత్రి - ధ్వజావరోహణం.

ఏప్రిల్ 15వ తేదీ సాయంత్రం 6 నుండి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగం నిర్వహించనున్నారు.

# 24 నుండి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనం అమలు

- మార్చి 25, 30వ తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

**తిరుపతి, మార్చి 22 మనం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలకు శ్రీవారి దర్శనం సోమవారం అనగా మార్చి 24వ తారీఖు నుండి అమలులోకి రానుంది. ఇందులో భాగంగా ఆదివారం నాడు సిఫార్సు లేఖలు స్వీకరించడం జరుగుతుంది.

అయితే ఇదివరకే టీటీడీ ప్రకటించిన విధంగా ఈనెల 30వ తారీఖున శ్రీ విశ్వావసు నామ సంవత్సర తెలుగు ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని మార్చి 25వ తారీఖున మంగళవారం నాడు శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనున్న నేపథ్యంలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయబడ్డాయి. ఈ కారణంగా మార్చి 25వ



తేదిన వీఐపీ బ్రేక్ దర్శనం కొరకు మార్చి 24వ తారీఖున ఎటువంటి సిఫార్సు లేఖలు స్వీకరించబడవని భక్తుల స్పష్టత కొరకు మరోసారి తెలియజేయడమైనది.

అదేవిధంగా ఇప్పటివరకు సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనానికి గాను ఆదివారం ఆంధ్ర ప్రజా ప్రతినిధుల నుండి స్వీకరిస్తున్న సిఫార్సు లేఖలు ఇకపై శనివారం నాడు (ఆదివారం దర్శనం కొరకు) స్వీకరించబడతాయని కూడా టీటీడీ గతంలోనే స్పష్టం చేసింది.


అయితే మార్చి 30వ తారీఖున ఆదివారంనాడు శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ కారణంగా మార్చి 29వ తారీఖున శనివారం నాడు ఎటువంటి సిఫార్సు లేఖలు స్వీకరించబడవని మరోసారి టీటీడీ స్పష్టం చేస్తోంది. ఈ మార్పులను భక్తులు దృష్టిలో ఉంచుకొని టిటిడికి సహకరించవలసిందిగా కోరడమైనది.

# కాణిపాకం వినాయక స్వామి సన్నిధిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్ రెడ్డి



**కాణిపాకం మార్చ్ 22 మనం న్యూస్ :** శ్రీ స్వామివారిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి మరియు చిత్తూరు జిల్లా పోర్ట్ పోలియో న్యాయమూర్తి జస్టిస్ శ్రీ సురేష్ రెడ్డి గారు, కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీ భీమారావు గారు, ఐరాల ఎమ్మార్వో, సి.ఐ శ్రీధర్ నాయుడు, తవనంపల్లె ఎస్సు, సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి, చిత్తూరు కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వెచ్చని జ్ఞాపకం..!!



జ్ఞాపకాల దొంతరలో
ఆ కట్టెల పొయ్యి మండుతూనే వుంది
లయబద్ధంగా వినిపించే
ఊదురు గొట్టం గాలి సడి
పొగ కమ్మినప్పుడల్లా
పమిట కొంగుతో తుడిచిన
తడియారని అమ్మ కళ్ళు...!!

కష్టాలను మోసుకొచ్చే కాలం
అప్పుడప్పుడు సుడిగాలిని తీసుకొస్తూ
కట్టెల పొయ్యి చుట్టూ
మంట తగలకుండా పెట్టే పోట్లాట
ఆరుబయట గాలితో అమ్మ
అన్నం ఉడికే దాకా చేసే యుద్ధం...!!

పండుగంటే మాతో పాటు
మా కట్టెల పొయ్యి సిద్ధమౌతుంది
కళ్ళాపితో తనూ స్నానమాడి
ముగ్గుల అల్లికతో ముస్తాబౌతుంది
కొత్త పాత్రలతో సరికొత్తగా కనబడుతోంది...!!

గ్యాస్ స్టౌల ఒరవడిలో
కట్టెల పొయ్యి కనుమరుగైనా
కటిక చీకటిలో ఉన్న పేదరికాన్ని
తన వెలుగులతో కడుపు నింపేది
తన వెచ్చని ఊపిరితో సేదతీర్చేది..!!

ఒంటరితనం రాజుకున్నప్పుడల్లా
జ్ఞాపకాల కుంపట్లోని కట్టెల పొయ్యి
కాసిన్ని వెచ్చదనాల్ని పంచుతూనే వుంది..!!


**- యు.ఎల్.ఎన్. సింహా**
7702280542

# పోరాట యోధుడు భగత్‌సింగ్



ఢిల్లీ వీధిలో ఎర్ర కాగితాలు చల్లి ప్రజలను చైతన్య పరిచాడు. విప్లవం వర్ధిల్లాలి అనే నినాదాన్ని ఇచ్చింది కూడా భగత్ సింగే. భారత స్వాతంత్ర్యోద్యమం లో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవ కారులలో అతను ఒకడు. ఈ కారణంగానే షహీద్ భగత్ సింగ్‌గా కొనియాడబడుతున్నాడు.

భారతదేశంలో స్వాతంత్ర్య సాధనే లక్ష్యంగా చీకటిని చీల్చు కుంటు మన దేశప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు వచ్చిన ఒక విప్లవ పోరాట యోధుడు భగత్ సింగ్. భగత్ సింగ్ జననం 1907 సెప్టెంబర్ 28న. ఇప్పటి పాకిస్తాన్‌ని లాయల్ జిల్లా బంగా సమీపంలోని ఖత్కర్‌కలాన్ గ్రామంలోని సందు ఝూట్ కుటుంబంలో కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు జన్మించాడు. భారత్‌లో బ్రిటీషు పాలనను వ్యతిరేకిస్తూ విప్లవా త్మక ఉద్యమాలను చేపట్టిన కుటుంబంలో అతను జన్మించాడు. యుక్త వయస్సులోనే ఐరోపా విప్లవ ఉద్యమాలను గురించి చదివిన సింగ్ అరాజకవాదం, సామ్యవాదమునకు ఆకర్షితు డయ్యాడు. అనేక విప్లవాత్మక సంస్థల్లో అతను చేరాడు. గణతంత్ర సంఘంలో ఒక్కో మెట్టు ఎక్కుతూ అనతికాలంలోనే అందులోని నాయకుల్లో ఒకడుగా ఎదిగిన అతను, ఆ తర్వాత దానిని హిందూస్తాన్ సామ్యవాద గణతంత్ర సంఘంగా మార్చా డు. భవిష్యత్తుకు బాల్యమే మొలక. మొలకలు వేసే వయస్సులో తుపాకులను మొలకెత్తించాలని చూడడం అతని వ్యక్తిత్వానికి మచ్చుతునక. విద్యార్థి దశలో అందరితో కలివిడిగా ఉండేవాడు భగత్ సింగ్. బాబాయి సర్దార్ అజిత్ సింగ్ ఆంగ్లేయులతో పోరా డుతూ విదేశాల్లో ఉంటున్న సమయంలో, కంట నీరు పెట్టుకొనే చిన్నమ్మ హర్నామ్ కౌర్ ను చూసి నాలుగేళ్ళ భగత్ సింగ్ ‘ పిన్నీ ఏడవొద్దు. నేను ఆంగ్లేయులపై ప్రతీకారం తీర్చుకుంటా‘ అని ప్రతిజ్ఞలు చేసేవాడు. స్వామి దయానంద సరస్వతి అనుచరుడైన సింగ్ తాత అర్జున్ సింగ్ హిందూ సంస్కరణ ఉద్యమం, ఆర్యసమాజ్‌లో భాగం కావడం కూడా అతనుపై విపరీతమైన ప్రభావం పడేందుకు దోహదపడింది. అతను పినతండ్రులు అజిత్ సింగ్, స్వరణ్ సింగ్ తండ్రులు కర్తార్ సింగ్ సారభా గ్రివాల్ , హర్ దయాల్ నేతృత్వంలోని గద్దర్ పార్టీ సభ్యులే. తనపై ఉన్న అపరిష్కృత కేసుల కారణంగా అజిత్ సింగ్ పెర్సియాకు పారిపోగా, కకోరి రైలు దోపిడీ 1925లో హస్తముందంటూ స్వరణ్ సింగ్‌ను 19 డిసెంబరు 1927న ఉరితీశారు. బ్రిటీషు సంస్థల యెడల పాఠశాల అధికారులకు ఉన్న విధేయత అతను తాతకు నచ్చకపోవడంతో భగత్ తన వయస్సు సిక్కులు వలె లాహోర్‌లోని ఖల్సా ఉన్నత పాఠశాలకు హాజరు కాలేదు. ఆర్యసామాజిక పాఠశాల దయానంద్ ఆంగ్లో వేదిక్ ఉన్నత పాఠశాలలో భగత్‌సింగ్‌ను చేర్పించాడు తండ్రి. 13 ఏళ్ల ప్రాయంలోనే మహాత్మా గాంధీ సహాయ నిరాకరణోద్యమానికి సింగ్ ప్రభావితుడ య్యాడు. ఆ సమయంలో బ్రిటీష్ ప్రభు త్వానికి ఎదురుతిరిగిన భగత్ ప్రభుత్వ పాఠశాల పుస్తకాలు, బ్రిటీషు దిగుమతి దుస్తులను తగులబెట్టడం ద్వారా గాంధీ సిద్ధాంతాలను అనుసరించా డు. ఉత్తరప్రదేశ్ లోని చౌరీ చౌరా గ్రామస్తులు పోలీసులను హింసా త్మకంగా హతమార్చిన నేపథ్యంలో ఉద్య మాన్ని గాంధీ ఉపసంహరించు కున్నాడు. అతను అహింసా వాదంపై అసంతృప్తి చెందిన సింగ్ యువ విప్లవోద్యమంలో చేరి, తెల్లదొరలకు వ్యతిరేకంగా హింసాత్మక ఉద్యమాన్ని ఉధృతం చేశాడు.రష్యా విప్లవ సాహిత్యాన్ని అధ్యయనం చేసి, గాంధీ కోరిన స్వాతంత్ర్యం అంటే తెల్లదొరలు పోయి నల్లదొరలు రావడమేనని అర్థం చేసుకున్నాడు. అందుకే భారతదేశంలో స్వతంత్ర్యం కంటే ముందు సోషలిస్టు సమాజం నిర్మించాలని. తను పనిచేస్తున్న హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్ని, హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోషియే షన్‌గా మార్చి సోషలిస్టుల నాయకత్వంలో స్వాతంత్ర్య పోరా టాన్ని నిర్వహించాడు. బ్రిటీష్ వలస పాలకుల విధానాలను ఎండగట్టేందుకు, బ్రిటీష్ వాళ్లు సాగిస్తున్న అరాచక పాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసేందుకు బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా నినదించే గొంతులు ఈ దేశంలో ఉన్నాయని మనదేశ ప్రజలకు తెలిసేందుకు కేంద్ర శాసనసభలో బాంబువేసి పారిపోకుండా సామ్రాజ్యవాదం నశించాలి. విప్లవం వర్ధిల్లాలనే నినాదాలను దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న మన దేశ ప్రజలకు అందించాడు భగత్‌సింగ్.



విప్లవకారుల చర్యలను అణచివేసే దిశగా భారత రక్షణ చట్టాన్ని తీసుకురావడం ద్వారా పోలీసులకు బ్రిటీష్ ప్రభుత్వం మరింత అధికారం కల్పించింది. భగత్ సింగ్ వంటి విప్లవకారులను అణచివేయడం ఈ చట్టం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. ప్రజాహితం కోసమేనంటూ ప్రత్యేక శాసనం కింద ఈ చట్టాన్ని ఆమోదించారు. అయితే ఆ చట్టాన్ని వ్యతిరేకిస్తూ అది ఆమోదితం కానున్న కేంద్ర శాసనసభపై బాంబు పేలుడుకు హిందూస్తాన్ సామ్యవాద గణతంత్ర సంఘం వ్యూహరచన చేసింది. బాంబు పేలుడుకు భగత్ సింగ్ ప్రయత్నించకుండా మరో ప్రముఖ విప్లవకారుడు చంద్రశేఖర్ ఆజాద్ అడ్డుకున్నాడు. అయితే సింగ్ ఆశయాలను అంగీకరించే విధంగా మిగిలిన పార్టీ సభ్యులపై ఒత్తిడి తీసుకొచ్చారు. శాసనసభ వసారాపై భగత్ సింగ్‌తోపాటు మరో విప్లవకారుడు 8 ఏప్రిల్ 1929న సింగ్, దత్‌లు బాంబు విసిరి, ‘ఇంక్విలాబ్ జిందాబాద్! అని వినికిడి శక్తి కోల్పోయేలా గొంతెత్తి అరుస్తామని ముద్రించబడిన పలు కరపత్రాలను వెదజల్లారు. బాంబు దాడి వల్ల ఏ ఒక్కరూ మరణించడం గానీ గాయపడటం గానీ జరగలేదు. తమ వ్యూహంలో భాగంగా ఉద్ధేశ్యపూర్వ కంగానే జాగ్రత్తలతో దాడి చేసినట్లు సింగ్, దత్ అంగీకరించారు. వాస్తవా నికి బాంబు దాడి తర్వాత సింగ్, దత్ ఇద్దరూ లొంగి పోయారు. సింగ్ అరెస్టు అనంతరం శాసనసభ పేలుడుపై విచారణ నేపథ్యంలో సాండర్స్ హత్య వెనుక హస్తంపై బ్రిటీష్ ప్రభుత్వం ఆరా తీసింది. హత్యకు సంబంధించి భగత్ సింగ్,రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లపై అభియోగా లు మోపారు. భారత స్వాతంత్ర్యానికి తన గళాన్ని వినిపిం చుకునేందుకు న్యాయస్థానాన్నే ఒక ప్రచార వేదికగా మలుచు కోవాలని భగత్ సింగ్ నిర్ణయించుకున్నాడు. హత్యా నేరాన్ని అంగీకరించిన అతను విచారణ సమయంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ప్రకటనలు చేశాడు.

ఖైదీలు, విచారణ ఖైదీల హక్కుల కోసం భగత్ సింగ్ , ఇతర ఖైదీలు జైలులోనే నిరాహారదీక్ష చేపట్టారు. చట్టం ప్రకారం ఉత్తమ హక్కులు కల్పించాల్సిన భారత రాజకీయ ఖైదీల కంటే బ్రిటీష్ హంతకులు, దొంగలకు ప్రాధాన్యత ఇవ్వడం దీక్షకు దారితీసింది. రాజకీయ ఖైదీలకు పౌష్టికాహారం, పుస్తకాలు, దినపత్రికల సదుపాయం, మంచి బట్టలు, మరుగుదొడ్డి ఇతర దైనందిన సదుపాయాలు కల్పించడం వారి డిమాండ్లు. అలాగే కార్మిక లేదా హోదాకు తగని పనిచేసే విధంగా రాజకీయ ఖైదీలపై ఒత్తిడి తీసుకురాకూడదని సింగ్ డిమాండ్ చేశాడు. 63 రోజుల పాటు కొనసాగిన నిరాహారదీక్ష సింగ్ డిమాండ్లకు బ్రిటీష్ ప్రభుత్వం తలొగ్గడం ద్వారా ముగిసింది. తద్వారా అతనుకు సాధారణ భారతీయుల్లో ఆదరణ పెరిగింది. దీక్షకు ముందు అతను ప్రాభవం ప్రధానంగా పంజాబ్ ప్రాంతం వరకే పరిమితమైంది.

కేంద్ర శాసనసభపై బాంబు దాడి జరిగినప్పుడు అక్కడున్న రాజకీయ నాయకుల్లో ఒకరైన మహ్మద్ అలీ జిన్నా లాహోర్ ఖైదీలకు బహిరంగంగానే తన సానుభూతి తెలిపాడు. నిరాహారదీక్షపై మాట్లాడుతూ ‘నిరాహారదీక్ష చేసే వ్యక్తిలో ఆత్మ ఉంటుంది. ఆ ఆత్మతోనే తను ముందుకు సాగుతాడు. తన పోరాటానికి న్యాయం జరుగుతుందని విశ్వసిస్తాడు‘ అని వ్యాఖ్యానించాడు.

23 మార్చి 1931న భగత్ సింగ్‌తో పాటు అతను సహచరులు రాజ్‌గురు, సుఖదేవ్‌లను లాహోర్లో ఉరితీశారు. సింగ్ ఉరిని వ్యతిరేకిస్తూ నిరసన చేపడుతున్న అతను మద్దతుదారులు అతన్ని ఆ క్షణమే షహీద్ లేదా అమరవీరుడుగా ప్రకటించారు. అప్పటి సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్ వి.ఎన్ స్మిత్ ప్రకారం, సింగ్‌ను ముందుగానే ఉరితీశారు.

సాధారణంగా ఉదయం 8 గంటలకు ఉరితీసేవారు. అయితే ఏమి జరిగిందో ప్రజలు తెలుసుకునే లోగానే అతన్ని ఉరితీయాలని నిర్ణయించారు...సుమారు రాత్రి 7 గంటల ప్రాంతంలో జైలు లోపల నుంచి ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నినాదాలు వినిపించాయి. సింగ్ జీవితానికి చివరగా తెర దించబోతున్నారన్న విషయానికి అది సంకేతమయింది. ఆ క్షణమే భగత్‌సింగ్ ఉరికొయ్యను ముద్దాడాడు. సట్లెజ్ నది ఒడ్డున ఉన్న హుస్సేనివాలా వద్ద సింగ్‌ను దహనం చేశారు. భగత్ సింగ్ స్మారకచిహ్నం నేడు భారత స్వాతంత్ర్య సమరయోధులను గుర్తుకు తెస్తుంది.


కులంపేరా, మతంపేరా ప్రాంతంపేరా జరుగుతున్న మనిషిని మనిషి దోచుకునే ఆర్థిక దోపిడి, శ్రమదోపిడి అసమానతలకు వ్యతిరేకంగా ఆర్థిక స్వాతంత్ర్యం కోసం, సోషలిస్టు సమాజ స్థాపనకు మార్క్సిస్టుల న్యాయకత్వంలో కమ్యూనిస్టుల కార్యచరణలో భగత్ సింగ్ లాంటి విప్లవకారుల ఆలోచలను ఆశయాలను ముందుకు తీసుకెళ్లామని భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆ యోధుడికి నివాళులు.

**- జి. పవన్ కుమార్**
9490099073

# వాతావరణ హెచ్చరికలతో అంతరాలను తుడిచేద్దాం



మన దేశంలో చూస్తే గోవా, మహారాష్ట్రలో ఫిబ్రవరిలో మొట్టమొదటి వడగాలులను నమోదు చేశాయి, భారత వాతావరణ శాఖ ప్రకారం శీతాకాలంలో (జనవరి-ఫిబ్రవరి) మొదటిసారి వడగాలులు సంభవించాయి. మార్చి 15, 2025న ఒడిశాలోని బౌధ్ భారతదేశంలో అత్యధిక ఉష్ణోగ్రతను నమోదు చేసింది. తీవ్రమైన వేడి కొనసాగింది, మార్చి 16న బౌధ్ 43.6 డిగ్రీల సెల్సియస్, ఝార్సుగూడ 42 డిగ్రీలు, బోలంగీర్ 41.7 డిగ్రీల సెల్సియస్ నమోదైంది.ఇక 2025 సంవత్సరంలో ప్రపంచ వ్యాప్తంగా భూమిపై మంచు తుఫానులు , చల్లని గాలులు , కరువులు , వేడి తరంగాలు , అడవి మంటలు , వరదలు , సుడిగాలులు, ఉష్ణమండల తుఫానులు వంటి అనేక వాతావరణ సంఘటనలు గణనీయమైన ప్రభావాన్ని చూపాయి. వాతావరణం అనేది ప్రపంచవ్యాప్తంగా ప్రజల జీవితాలు, ఆర్థిక వ్యవస్థలు, పర్యావరణ వ్యవస్థలను నేరుగా ప్రభావితం చేస్తుంది.మన వాతావరణంలో మార్పులు మరింత తీవ్రమైన వాతావరణ సంఘటనలకు దారితీస్తున్నాయి. వేగంగా తీవ్రతరం అవుతున్న ఉష్ణమండల తుఫానులు, వినాశకరమైన వర్షపాతం, తుఫానులు, వరదలు, ప్రాణాంతక కరువులు, అడవి మంటలు అధికమవుతున్నాయి. సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. జనసాంద్రత కలిగిన తీర ప్రాంతాలు తీరప్రాంత ఉప్పెన, సముద్ర అలల ప్రభావాలకు గురవుతున్నాయి.



ప్రపంచ వాతావరణ దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 23న నిర్వహించబడుతుంది. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులకు సంబంధించి వాతావరణంపై అధ్యయనం చేసేందుకు 1950 మార్చి 23న, 180 దేశాల సభ్యత్వంతో ప్రపంచ వాతావరణ సంస్థ ప్రారంభించబడింది. 75 సంవత్సరాలకు పైగా డబ్ల్యూఎంఓ వాతావరణ వ్యవస్థ శాస్త్రంలో ప్రపంచంలో ముఖ్య పాత్రను పోషిస్తుంది. ఆ సంస్థ ఏర్పడిన రోజును ప్రపంచ వాతావరణ దినోత్సవంగా నిర్ణయించబడింది. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ దినోత్సవం జరుపబడుతుంది. ప్రకృతి సహజ ఆవసాలపై వాతావరణ మార్పులు చూపే ప్రభావం గురించి ప్రజలకు అవగాహన కలిగించడంకోసం ఈ దినోత్సవ ఉద్దేశ్యం. వాతావరణ నమూనాలను అంచనా వేయడంలో, వాతావరణ మార్పులను పర్యవేక్షించడంలోను, ప్రకృతి వైపరీత్యాలకు సిద్ధం చేయడంలోను, వాతావరణశాస్త్ర కీలక పాత్రను ఈ రోజు నొక్కి చెబుతుంది. వాతావరణ మార్పులు, విపరీతమైన వాతావరణ సంఘటనలు, పెరుగుతున్న సముద్ర మట్టాలు వంటి ప్రపంచ సవాళ్లను పరిష్కరించడంలోనూ వాతావరణ శాస్త్రం ఉపయోగపడుతుంది.

**ముందస్తు హెచ్చరిక వ్యవస్థ:**

2024 అత్యంత వేడి సంవత్సరం అని డబ్ల్యూఎంఓ ఇటీవల నిర్ధారించింది. సంక్లిష్ట పరస్పర చర్యలను అర్థం చేసుకోవడం, అంచనా వేయడం కోసం ప్రభావవంతమైన ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటుచేసుకోవడం చాలా అవసరం. వాతావరణ హెచ్చరిక కేంద్రాల ఖచ్చితమైన వాతావరణ సూచన, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు ప్రజలను అప్రమత్తం చేస్తాయి. ఇది వారి జీవనోపాధి అల్లకల్లోలం కాకుండా కాపాడుతుంది. మానవ ప్రేరిత వాతావరణ మార్పు మరింత తీవ్రమైన వాతావరణ పరిస్థితులకు దారితీస్తున్నందున, ప్రభావవంతమైన బహుళ ప్రమాద ముందస్తు హెచ్చరిక వ్యవస్థల అవసరం గతంలో కంటే చాలా ముఖ్యమైనది. రాబోయే తుఫానులు, వరదలు లేదా కరువుల గురించి ప్రజలను హెచ్చరించే, సహాయక చర్యలను అందించే వ్యవస్థలు విలాసవంతమైనవి కావు. కానీ జీవితాలను రక్షించే, ఆర్థిక నష్టాలను తగ్గించే, పెట్టుబడిపై దాదాపు పది రెట్లు రాబడిని అందించే ఖర్చుతో కూడుకున్న సాధనాలు. ముందస్తు హెచ్చరికల వలన ఈ సమస్యలను పూర్తిగా పరిష్కరించలేకపోయినా చాలా వరకూ నష్టాన్ని నివారించవచ్చు. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు ఇప్పటికే మరణాల సంఖ్యను తగ్గించడంలో సహాయపడ్డాయి. ప్రమాదకర వాతావరణం, నీరు లేదా వాతావరణ సంఘటనల వల్ల కలిగే నష్టాలను తగ్గించాయి. వాతావరణ ప్రమాదాలు పెరుగుతున్న కొద్దీ వీటి ఆవశ్యకత పెరుగుతూనే ఉంది. అయితే అత్యాధునిక సాంకేతికతతో ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు ఏర్పాటు చేయాలంటే ప్రపంచంలో కొన్ని దేశాలకు మాత్రమే సాధ్యం అవుతుంది. అల్ప ఆదాయ దేశాలు ఈ వ్యవస్థలు నిర్మించుకోలేవు. ఇది ప్రపంచ దేశాల మధ్య అంతరాలను సృష్టిస్తుంది. కానీ అన్ని దేశాల ప్రజల ప్రాణాలను కాపాడటం, జీవనోపాధిని రక్షించడం, సమాజ స్థితిస్థాపకతను బలోపేతం చేయడం లాంటివి అన్ని దేశాల ఉమ్మడి బాధ్యత. దీని కొరకై ఈ అంతరాలను తగ్గించడం లేదా మూసివేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. అందువలన ఏడాది ఇతివృత్తంగా ‘ముందస్తు హెచ్చరిక అంతరాన్ని కలిసి మూసివేయడం‘గా తీసుకోవడం జరిగింది. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను పెంపొందించడంలో ప్రపంచ సహకార ప్రాముఖ్యతను ఈ థీమ్ నొక్కి చెబుతుంది. ముందస్తు హెచ్చరిక అంతరాన్ని కలిసి తగ్గించడం ద్వారా, మనం సురక్షితమైన, మరింత స్థితిస్థాపకంగా ఉండే ప్రపంచాన్ని నిర్మించగలము.

బహుళ ప్రమాద ముందస్తు హెచ్చరిక వ్యవస్థల ప్రపంచ స్థితి ( గ్లోబల్ స్టేటస్ ఆఫ్ మల్టీ హజార్డ్ ఎర్లీ వార్నింగ్ సిస్టమ్స్- ఎంహెచ్ఇడబ్ల్యూఎస్) 2024 నివేదిక ప్రకారం 2015 నుండి ప్రపంచం అత్యధిక స్థాయిలో ముందస్తు హెచ్చరిక కవరేజీని నివేదించింది. తక్కువ సమగ్రమైన ఎంహెచ్ఇడబ్ల్యూఎస్ ఉన్న దేశాలు విపత్తు సంబంధిత మరణాల నిష్పత్తిని కలిగి ఉన్నాయని, ఇది 'గణనీయమైన' నుండి 'సమగ్ర' కవరేజ్ ఉన్న దేశాల కంటే దాదాపు ఆరు రెట్లు ఎక్కువగా ఉందని, దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ విపత్తు ప్రభావిత వ్యక్తులను కలిగి ఉన్నాయని నివేదించింది. 2024 నాటికి 108 దేశాలు బహుళ ప్రమాద ముందస్తు హెచ్చరిక వ్యవస్థలకు కొంత సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని తెలిపాయి. ఇది 2015లో 52 దేశాల కంటే రెట్టింపు కంటే ఎక్కువ. అందరికీ ముందస్తు హెచ్చరికలు అనేది 2027 చివరి నాటికి ప్రజల్ ప్రాణాలను రక్షించే ముందస్తు హెచ్చరిక వ్యవస్థల ద్వారా భూమిపై ఉన్న ప్రతి ఒక్కరినీ ప్రమాదకరమైన వాతావరణం, నీరు లేదా వాతావరణ సంఘటనల నుండి రక్షించేలా చేయాలని అంతర్జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

**ప్రధానమైనవి నాలుగు:**

అందరికీ ముందస్తు హెచ్చరికల వ్యవస్థ అందుబాటులోనికి తేవడానికి నాలుగు విషయాలు ప్రధానమైనవి. అవి ఒకటి విపత్తు ప్రమాద పరిజ్ఞానం కలిగి ఉండాలి. రెండు ప్రమాదాల గుర్తింపు, పరిశీలనలు, పర్యవేక్షణ, విశ్లేషణ మరియు అంచనా వేయగలగాలి. మూడు హెచ్చరిక సమాచారాన్ని వ్యాప్తి చేయగలగాలి. నాలుగు ప్రతిస్పందించడానికి సంసిద్ధత కలిగి ఉండాలి. అయితే అంచనా సామర్థ్యాలు గణనీయంగా అభివృద్ధి చెందినప్పటికీ, పరిశీలన నెట్వర్క్లు, అంచనా ఖచ్చితత్వం, అధిక-నాణ్యత వాతావరణ, జలసంబంధమైన డేటాను పొందడంలో అంతరాలు అలాగే ఉన్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో జాతీయ వాతావరణ జలసంబంధమైన సేవలను బలోపేతం చేయడం వాతావరణ అనుకూలతకు మాత్రమే కాదు, ఇది ప్రపంచ స్థితిస్థాపకత, భద్రత ఆర్థిక స్థిరత్వానికి కూడా అవసరం.

‘అన్ని దేశాలలో వాతావరణ సంబంధిత ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలకు స్థితిస్థాపకత, అనుకూల సామర్థ్యాన్ని బలోపేతం చేయడం; వాతావరణ మార్పు చర్యలను జాతీయ విధానాలు, వ్యూహాలు, ప్రణాళికలలో సమగ్రపరచడం; వాతావరణ మార్పుల తగ్గింపు, అనుసరణ, ప్రభావ తగ్గింపు ముందస్తు హెచ్చరికపై విద్య, అవగాహన పెంచడం, మానవ సంస్థాగత సామర్థ్యాన్ని మెరుగుపరచడం చేయాలని’ యుయన్ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో పదమూడవది తెలుపుతుంది. 2030 కల్లా సాధించాల్సిన అవసరం ప్రపంచ దేశాల అన్నింటి మీద ఉంది.

**మార్చ్ 23 ప్రపంచ వాతావరణ దినోత్సవం సందర్భంగా..**

**- కింజరాపు అమరావతి**
82472 86357

# స్వాతంత్రోద్యమాలే.. భావితరానికి దారులు



ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు, అందరికీ వందనాలు. 1858 నుంచి 1947 వరకు బ్రిటీష్ వన్య పాలకుల పాలనలో ఎందరో మహానుభావులు స్వేచ్ఛ కోసం పిడికిలి బిగించి పోరాడి తుదకు ప్రాణాలు సహితం అర్పించారు. భరతమాత దాస్య శృంఖలాలను ఛేదించి స్వేచ్ఛను సమకూర్చే మహాయజ్ఞంలో ప్రాణాలర్పించిన నిస్వార్థ దేశ భక్తులు ఎందరో. అలాంటి అమరుల జాబితాలో మహాత్మాగాంధీతో మొదలు అసంఖ్యాక యోధులు ఎనలేని పోరాట పటిమ ప్రదర్శించి తెల్ల తోలు పాలకుల గుణడెల్లో గుబులు పుట్టించారు. ఆ జాబితాలో అమరులైన ప్రముఖులుగా భగత్ సింగ్, సుఖ్దేవ్, రాజ్గురు యువ త్రయం ముందు వరుసలో ఉంటారు.

23 మార్చి 1931న అపర దేశ భక్తులు భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్ గురు త్రయం దేశ సేవలో తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన స్వాతంత్ర్య సమర యోధులను ఉరికంబం ఎక్కించిన రోజుగా దేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో చెరగని ముద్రను వేసింది. 23 మార్చి షహీదా దివస్ లేదా అమరుల దినంతో పాటు ఇతర భరతమాత ముద్దు బిడ్డలు ప్రాణాలర్పించిన 30 జనవరిని మహాత్మాగాంధి వర్ధంతి, మే 19న అస్సాం అమరవీరుల దినం, 13 జూలైన కాశ్మీర్ అమరవీరుల దినం, 21 అక్టోబర్న పోలీస్ అమరవీరుల దినం, 17 నవంబర్న ఒరిస్సాలో లాలా లజపతిరాయి రాయ్ వర్ధంతి, 19 నవంబర్న ఝాన్సీ లక్ష్మిభాయ్ జన్మదినం, 24 నవంబర్న సిక్కు గురు తేగ్ బహదూర్ వర్ధంతి లాంటి పలు అమరవీరుల జ్ఞాపకార్థ కార్యక్రమాలు నిర్వహించడం భారత దేశవ్యాప్తంగా జరుగుతున్నది.

దేశభక్తిని నరనరాన జీర్ణించుకున్న యువకులు భగత్ సింగ్, సుఖ్దేవ్ తాపర్, శివరామ్ రాజ్గురు త్రయం హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ సభ్యులుగా స్వాతంత్ర్య ఉద్యమ కెరటాల వలె ఎగిసిపడి బ్రిటీష్ పాలనను వ్యతిరేకిస్తూ యువ విప్లవ జ్యోతులుగా వెలుగొందారు. లాలా లజపతిరాయి మరణానికి స్పందనగా నాటి బ్రిటీష్ అధికారి జె పి సార్‌ను చంపారనే అభియో గాల మీద ఈ ముగ్గురు యువకులను అరెస్టు చేసి లాహోర్ కాన్స్పరసీ కేసును కొనసాగించిన బ్రిటీష్ వలస పాలకులు ఈ యువ త్రయానికి ఉరి శిక్ష విధించడం జరిగింది. అంతర్జాతీయ పౌర సమాజం క్షమాభిక్ష పెట్టాలని వేడుకున్నప్పటికీ కక్ష పూరితంగా వలస పాలకులు 23 మార్చి 1931న ఈ ముగ్గురిని ఉరి తీయడం జరిగింది. భగత్ సింగ్ త్రయం 08 ఏప్రిల్ 1929న ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినదిస్తూ సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీపై బాంబులు విసరడంతో కేసును నమోదు చేసి లాహోర్ జైల్లో ఉరి శిక్ష అమలు చేసారు. దేశవాసుల అశ్రునయనాల మధ్య వారి పార్థివ దేహాలను సుత్లజ్ నదీ తీరాన దహన సంస్కారాలునచేయడం జరిగింది. ఈ ముగ్గురు అగ్గి రవ్వలు చూపిన తెగువ, దేశభక్తి, అంకితభావం, త్యాగగుణం, ధైర్య సాహసాలు నేటి భారతీయ యువతకు దారి దీపాలుగా నిలుస్తున్నాయి. వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ, వారు అందించిన స్వాతంత్ర్యాన్ని భాద్యతాయుతంగా అనుభవిస్తూ దేశ అభ్యున్నతికి సమిధలుగా మారాలని కోరుకుందాం.

భగత్ సింగ్, సుఖ్‌దేవ్ , రాజ్‌గురుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ 23 మార్చిన వారి చిత్రపటాలకు నివాళులు అర్పించడం, విద్యాలయాల్లో అవగాహనలు, ప్రజలను చైతన్యపరచడం, దేశభక్తి కేంద్రంగా ర్యాలీలు నిర్వహించడం, వారి జీవిత చరిత్రకు సంబంధించిన సినిమాల ప్రదర్శనలు, రక్తదాన శిబిరాలు, క్యాండిల్ లైట్ ర్యాలీలు, కవితా పోటీలు లాంటి కార్యక్రమాలను నిర్వహించి వారి రుణం తీర్చుకుందాం. మహానుభావుల త్యాగాలకు ప్రతిఫలం ఈ స్వతంత్రం, మన కర్తవ్యాలను నిర్వహిద్దాం. స్వేచ్ఛ ఉచితంగా రాలేదు, ప్రాణ త్యాగం చేసిన వారికి సదా రుణపడి ఉందాం. అమరవీరులా ఎన్నడు మన హృదయాల్లో జీవించే ఉంటారు. నేటి యువభారతానికి ఉజ్వల యువ కెరటాలైన భగత్ సింగ్,సుఖ్‌దేవ్ , రాజ్‌గురు త్రయా నికి ఘన నివాళులు అర్పిద్దాం.

**(23 మార్చి భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్ గురుల వర్ధంతి సందర్భంగా)**



**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

## ఫిరంగిలో పావురం గూడు?

ఫిరంగి లోపల భయం లేకుండా
పావురాలు గూడు కట్టుకున్న నాడు
ఫికరు లేకుండా
గుడ్లు పెట్టి ఇంకా ఇంకా
ఇంకా పావురం పిల్లలను
ప్రపంచాన ఎగరేసిన
నాడు కదా
విశ్వంలో శాంతి
దేవత ప్రతిష్ఠ !!
నిజంగా ఈ ఆధునిక ఫిరంగులన్నీ
పాడుపడిపోనీ!
అన్నిట్లో కపోతాలు కాపురం చేయనీ
ఓం శాంతిః శాంతిః శాంతిః
భారతీయ శాంతి మంత్రం ప్రతిధ్వనించనీ!

**- కందాళై రాఘవాచార్య**
8790593638




వాకింగ్ లో ఉన్నా బ్రిడ్జిపైన
ఒక జంట దూకేసింది
తీర్చలేని అప్పులో
సరిదిద్దుకోలేని
తప్పులో తెలియదు
పిఎస్ కి ఫోన్ చేశాను
వన్ నాట్ ఎయిట్ కి మెసేజ్
పెట్టాను
రాత్రి గొడుగు విప్పుకుంది
మెల్లగా
ఉదయమే మళ్లీ
వాకింగ్‌లో వచ్చి స్పాట్‌కి
చేరుకొన్నాను
చీకటి మింగేయ్యలేదు కదా ఆ
జంటని
నీళ్లు తాళ్ళు పేని ఉరివేయలేదు
కదా ఆ జంటని
ఔననే అన్నట్టు
నిమ్మళంగా నది ప్రవహిస్తుంది

**- కోటం చంద్రశేఖర్**
9492043348

## అక్షరం



నేను
నుంచుంటే చెట్టునే

తలొంచి చూస్తే
విస్తరించిన నేలనే

స్పర్శిస్తే అలుముకునే
గాలినే

తలెత్తి చూస్తే
అనంతమైన ఆకాశాన్నే

ఆగ్రహంతో గర్జిస్తే
మహోగ్ర జలనిధినే

ఆదరంతో
దరిచేరితే
అమృత భాండాన్నే

అవమానిస్తే
ఎవరు ఆర్పలేని
అనల గీతాన్నే

సమస్త శక్తుల
సమాహార రూపాన్నే

వెలిగే వెలిగించే అక్షర
దీపాన్నే!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
9440233261

# నాయనానందకరంగా శ్రీవారి వసంతోత్సవ సేవ...

- అంగరంగ వైభవంగా వేంకటేశ్వర స్వామి వారి నిత్య కళ్యాణోత్సవం...







భువనగిరి, మార్చి 22(మనం న్యూస్): యాదాద్రి తిరుమల శ్రీ స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో స్వామివారి నిత్య కైంకర్యములలో భాగంగా శనివారం రోజు తెల్లవారుజామున సుప్రభాత సేవతో మొదలుకొని రాత్రి ఏకాంత సేవ వరకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు తెలిపారు. నేటి ఉదయం 6 గంటలకు అలంకార ప్రియుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సుగంధ భరితమైన పుష్పమాలలతో తోమాల సేవను నయన మనోహరంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్యక్షేత్రంలో శనివారం సందర్భంగా శ్రీ అష్టలక్ష్మి మండపంలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పంచామృతములు, పసుపు , సుగంధ ద్రవ్యాలతో వసంతోత్సవ సేవను శోభాయ మానంగా నిర్వహించగా ఆలయ అర్చకులు కర్పూర మంగళహారతులను సమర్పించారు. ఉదయం 10:30 లకు విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి స్వామి వారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రధాన అర్చకులు దిట్టకవి శ్రవణాచార్యులు దివ్యకరములచే అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా నేడు సుమారు 5 వేల మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం 6:30 కు ఆదిమధ్యాంతరహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారు జాజ్వల్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు. భారత దేశంలో స్వర్ణగిరి క్షేత్రంలో తప్ప మరెక్కడా లేని జల నారాయణ స్వామి వారికి శనివారం సందర్భంగా నక్షత్ర హారతిని భక్తుల గోవింద నామ స్మరణల మధ్య సమర్పించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు చైర్మన్లు మానేపల్లి మురళీకృష్ణ గోపికృష్ణలు తెలిపారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



చిలుకూరు, మార్చి 22 ,(మనం న్యూస్): మండలం పరిధిలోని సీతరాంపురం ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు, ఉన్నత స్థాయి అధికారులు వేషదారణలు వేశారు. అనంతరం విద్యార్థులకు చర్చి ఫాదర్ అబ్రహం పోత్సాహకంగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుర్రి సైదమ్మ, ఉపాధ్యాయులు కె. సూక్యా తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలి



- గిరిజన ఆదివాసి కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్

రంగారెడ్డి మార్చి 22(మనం న్యూస్): ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి రాజకీయంగా పనికిరాడు అని, అసలు ఎమ్మెల్యే పదవికి అనర్హుడు అని గిరిజన ఆదివాసి కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్ అన్నారు. హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్ ను ఆమె నివాసంలో శనివారం కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఆయన పరామర్శించారు. అనంతరం బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ ఒక బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా ఉండి మహిళలను అగౌరపరిచే విధంగా మాట్లాడడం సుధీర్ రెడ్డికి సరికాదన్నారు. తను చేసిన వ్యాఖ్యలకు నైతికంగా బాధ్యత వహించి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. చట్టపరంగా అతడిపై చర్యలు తప్పవని, కఠినశిక్ష పడే వరకు మేము పోరాడుతూనే ఉంటామన్నారు. త్వరలోనే నేషనల్ ఎస్టీ కమిషన్ ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. సుధీర్ రెడ్డికి కులపిచ్చి ఉందని, స్త్రీలు అంటే గౌరవం లేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాత నాయక్, టీపీసీసీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ గౌని నర్సింహ గౌడ్, కాంగ్రెస్ చంపాపేట డివిజన్ అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి, మహిళా నాయకురాలు లత, అనసూయ, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్వయంపాలనతో నాయకత్వ లక్షణాలు పెంపు

- సౌమ్య విద్యామందిర్ ఏపూర్ లో ఉత్సాహంగా స్వయం పరిపాలన
- విద్యార్థులే గురువులు, అధికారులు, పాలకులుగా



చిట్యాల, మార్చి 22(మనం న్యూస్ ): బాల్యదశలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి స్వయంపాలన అలంబనగా నిలుస్తోందని ఎస్.వి.ఎం పాఠశాల కరస్పాండెంట్ తాటి సోమలింగం, ప్రిన్సిపల్ బొడిగె రవీందర్ పేర్కొన్నారు. చిట్యాల మండలం ఏపూర్ గ్రామంలోని సౌమ్య విద్యామందిర్ (ఎస్.వి.ఎం) పాఠశాలలో స్వయం పరిపాలనా దినోత్సవాన్ని విద్యార్థులు బుధవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. పాఠశాల విద్యార్థులు ఉదయం నుండి సాయంత్రం వరకు ఒకరోజు అధికారులు, రాజకీయ నాయకులు, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులుగా తమ హావభావాలతో అలరించారు. కరస్పాండెంట్ గా బచ్చగోని రితిక, ప్రిన్సిపల్ గా పాలెం భూమిక, జిల్లా పాలనాధికారిగా సురిగి హేమల్, విద్యాశాఖ మంత్రిగా తర ఉదయ్, పంతంగి లాస్య, ఎమ్మెల్యేగా బొడిగె ఆకాష్, జడ్పీ చైర్మన్ గా పాలెం అక్షిత, జిల్లా విద్యాధికారిగా సిలివేరు సాహిత్, జిల్లా ఉప విద్యాధికారిగా సురిగి విమల్, మండల విద్యాధికారిగా మునుకుంట్ల జీవన్, ఎంపీడీవోగా కొడతం శ్రావ్య, ఎంపీపీగా ఉమ్మెంతల దీపిక తమ విధులను నిర్వర్తించి పాఠశాల, తరగతుల నిర్వహణను పర్యవేక్షించారు. ఉపాధ్యాయులుగా అర్చన, రిత్యశ్రీ, రితిక, ఖుషి, పవన్, లోహిత్, నందితారాధ్య, శ్రీహస్వి, శాన్వి, శాన్విక, చైతన్య, తన్వీశ్రీ, హాన్విక, రవీంద్ర తేజ్, ఆరాధ్య, ప్రజ్ఞశ్రీ, ధన్యశ్రీ, శ్రీఖర్, లిఖిత, శ్రీతేజ్, రక్షిత్, బిందు ప్రత్యేక అలంకరణలో ఉపాధ్యాయులను అనుకరిస్తూ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించిన తీరు ఆకట్టుకుంది. వివిధ హోదాల్లో విద్యార్థులు విధులు నిర్వహించడం చూసిన వారి తల్లిదండ్రులు మురిసిపోయారు. తమకు చదువు చెప్పిన టీచర్ల ముందే ఉపాధ్యాయుల, పాలకుల అవతారం ఎత్తారు. ఉపాధ్యాయులు వారిలోని ప్రతిభ నైపుణ్యాలను, వెలికి తీశారు. రాజకీయ నేతల పాత్రలో ఉన్న విద్యార్థులు ప్రత్యేక వాహనాలలో పాఠశాలకు చేరుకున్నారు. ఎమ్మెల్యేగా వ్యవహరించిన బొడిగె ఆకాష్ భారీ కాన్వాయ్ లో పాఠశాలకు చేరుకోగా విద్యార్థులు పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అంఫేజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో మనోవికాసానికి, నాయకత్వ లక్షణాలు పెంపొందడానికి ఉపయోగపడతాయని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంత జఠిలమైందో ఒకరోజు అనుభవంలో నేర్చుకున్నామని విద్యార్థులు తమ అనుభవాలను తెలిపారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు సిలివేరు నరేష్, ఉమ్మెంతల ఉమాశంకర్, యాకారి యాదయ్య, కోనేటి యాదగిరి, బండ శేఖర్, జవాజి మమత, సుక్క కవిత, చెడుబుద్ధి విష్ణు, మొహమ్మద్ జావేద్, పి. రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి జండా ఆవిష్కరణ



చేవెళ్ల,మార్చి 22 (మనం న్యూస్ ): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండల కేంద్రంలో ప్రధాన కార్యాలయంలో జరిగిన బిజెపి జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బిజెపి యువ నాయకులు డాక్టర్ వైభవరెడ్డి, షాబాద్ మండల్ బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల 75 సర్వే నెంబరులో గుడిసెలను తొలగించాలి

- అర్హులైన పేదలైన ఎస్సీ మాదిగలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి
- చేవెళ్ల ఆర్డీఓ, ఎమ్మార్వో లకు దరఖాస్తు ఇచ్చిన అంబేద్కర్ నగర్ కాలనీ వాసులు



చేవెళ్ల, మార్చి 22(మనం న్యూస్ ): చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని షాబాద్ చౌరస్తా నుండి అంబేద్కర్ నగర్ కాలనీకి వెళ్లే దారిలో ఉన్న సర్వే నెంబర్75 లో వేసిన గుడిసెలను తొలగించాలని చేవెళ్ల అంబేద్కర్ నగర్ కాలనీ వాసులు చేవెళ్ల ఆర్డీఓ, ఎమ్మార్వో లకు దరఖాస్తు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మార్పీఎస్ చేవెళ్ల గ్రామ అధ్యక్షులు కొజ్జెంకి యాదయ్య (పాస్టర్) మాట్లాడుతూ చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని షాబాద్ చౌరస్తా నుంచి అంబేద్కర్ నగర్ కాలనీలోకి వెళ్లే దారిలో ఉన్న సర్వే నంబర్ 75 లో వేసిన గుడిసెలను తొలగించాలన్నారు. ఆ భూమి ఎస్సీ మాదిగలకు బతుకు దెరువు కోసం ప్రభుత్వం ఇచ్చిన భూమి అని, అందుకు సంబంధించి ప్రభుత్వ భూమి పై పట్టా పాస్ పుస్తకాలు కూడా ఉన్నాయన్నారు. కొందరు రాజకీయ నాయకులు దురుద్దేశంతోనే వారికి సంబంధించిన వ్యక్తులతో గుడిసెలు వేయించారని , రాత్రి సమయంలో సీసీ రోడ్డుపై మద్యం తాగుతూ నడుచుకుంటూ వెళ్తున్న వారికి వాహనాలు నడుపుకుంటూ వెళ్తున్న వారికి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వివరించారు. విద్యుత్ తీగలు దారికి అడ్డంగా వేయడంతో వాహన చోదకులకు ప్రమాదం పొంచి ఉందని, రాత్రి సమయంలో కాలనీలో కొత్త వ్యక్తులు సంచరిస్తున్నారు. ఆడవాళ్లు చిన్నపిల్లలకు భయభ్రాంతులకు గురవుతున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రంలో కొజ్జెంకి సుదర్శన్, బొప్పె శ్రీనివాస్, కందాడ మాణిక్యం, పొట్ట నర్సింలు, పోతుగంటి వెంకటయ్య , కొజ్జెంకి సత్యనారాయణ, చిన్నొళ్ల కి శ్రీనివాస్, కొజ్జెంకి మహేందర్, జి.నర్సింలు , సిద్ధి బాలు, అగ్రపల్లి అశోక్, మల్లెళ్ళ శివ కుమార్, చేకూరి ప్రవీణ్ , ఎడ్డిమూతి వెంకటేష్, పొట్ట దయాకర్ , హైతాబాద్ వినోద్, జి వెంకటేష్, పొట్ట రాజు , సిద్ధి మహేందర్, సిద్ధి సూరి, జి నరేష్, కుమ్మరి మల్లేష్ , కే యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం



మేళ్లచెరువు మార్చి 22 మనం న్యూస్: స్థానిక మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ శ్రీనగర్ కాలనీ మేళ్లచెరువు నందు వేంచేసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఏకోత్తర సహస్ర కళాశాభిషేక ప్రయుక్త 27వ మహోత్సవ శుభ బ్రహ్మోత్సవములలో భాగంగా శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో, అహోబిల రామానుజన్ జీయర్ స్వామి వారు, దేవానాద జీయర్ స్వామి వారి సమక్షంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవము అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితులు మంత్రోచ్చారణలు మంగళ వాయిద్యాలు శాస్త్రోక్తముగా కళ్యాణ మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్నజీర స్వామి వారి తీర్థ గోష్టిలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్న జీయర్ స్వామి మాట్లాడుతూ శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి అనుగ్రహంవలన మహా సిమెంట్స్ ఈ స్థాయికి చేరుకుందని, దేశంలోనే ఒక మహా బ్రాండ్ ల్యాండ్ మార్క్ గా నిలిచిపోయిందని అయన అన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహం ఉన్న గత 27 సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం మేళ్లచెరువుకి బ్రహ్మోత్సవ కార్యక్రమములకు రావటం తన యొక్క అదృష్టంగా భావిస్తున్నాను అని చిన్న జీయర్ స్వామి అన్నారు. స్వామి గారి అనుగ్రహం వల్ల ప్రజలు సుభిక్షంగా ఉండగలుగుతున్నారని విశ్వాసంతో స్వామిని పూజ చేయాలని ఆయన అన్నారు. ఇట్టి కార్యక్రమంలో భాగస్వాములైనటువంటి మై హోమ్ సిమెంట్స్ కార్మికులకు ఉద్యోగులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థలో 10 సంవత్సరములు, 20 సంవత్సరాలు పని చేసినటువంటి కంపెనీ ఉద్యోగులకు 5 గ్రాములు బంగారు నాణేలు స్వామీజీ అందజేశారు, అలాగే ఈ సంవత్సరమువిశ్వావసు నామ సంవత్సర ఉగాది సంవత్సర పంచాంగ క్యాలెండర్ విడుదల చేసి భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మై హోమ్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ జూపల్లి రామేశ్వరావు, శ్రీకుమారి దంపతులు, మునగాల రామ్మోహన్ రావు, అరుణ దంపతులు, వైస్ చైర్మన్ జూపల్లి వినోద్ రావు భార్గవి దంపతులు మేనేజింగ్ డైరెక్టర్ జూపల్లి రంజిత్ రావు, రజిత దంపతులు, జూపల్లి రామురావు, మేఘన దంపతులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాంబశివరావు, డైరెక్టర్ ఆపరేషన్స్ చంద్రశేఖర్ పాండే, సీనియర్ ప్రెసిడెంట్ జగదీష్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ హెచ్ ఆర్ లక్ష్మీనారాయణ ఎర్రబెల్లి మురళీధర్ రావు, యన్.శ్రీనివాసరావు అనురాధ దంపతులు ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

## మల్లన్న కల్యాణమహోత్సవంలో హోమం నిర్వహణ



గండిపేట, మార్చి 22(మనంన్యూస్): మణికొండ బీరప్ప మల్లన్న స్వామి ఆలయంలో మల్లన్న కళ్యాణ మహోత్సవం కొనసాగుతుంది. ఈ మహోత్సవంలో భాగంగా శుక్రవారం ఆలయంలో హోమం, సత్యనారాయణవ్రతాలు నిర్వహించారు. ఈ క్రతువుల్లో భక్తులు పాల్గొని హోమం, సత్యనారాయణవ్రతాలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కే రామకృష్ణ, మాజీ సర్పంచ్ జైహింద్ రావు , నార్సింగ్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బుదోళ్ల శ్రీరాములు , మణికొండ కురుమ సంఘం అధ్యక్షులు బుద్దోలు ముత్యాలు, నాయకులు కురుమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నీటి సంరక్షణ మన అందరి బాధ్యత

సేఫ్ వాటర్ నెట్వర్క్ ఇండియా




రంగారెడ్డి మార్చి 22 (మనం న్యూస్) భవిష్యత్ తరాలకు నీటిని అందించడానికి నీటి సంరక్షణ ఒక్కటే మార్గమని మలక్ పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి , సేఫ్ సాటిన్ నెట్వర్క్ ఇండియా ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీకాంత్ లు అన్నారు. శనివారం పాఠశాలలో వరల్ వాటర్ డే సందర్భంగా సేఫ్ వాటర్ నెట్వర్క్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లు మొట్టమొదటిది నీటి సమస్య అని, భారత దేశ అభివృద్ధికి ప్రధాన కారణమైన వ్యవసాయ రంగం , పారిశ్రామిక రంగం , ప్రజల యొక్క త్రాగునీటి అవసరాలకు సరిపడా నీరు దేశం లోపల లేనందున రోజురోజుకు నీటి సమస్యలు అధికమవుతున్నాయని అన్నారు. ఈ సమస్యను అధికమించడానికి సమాజంలో పౌరులందరూ నీటి సంరక్షణ పద్ధతులు పాటించాలని , గృహాలలో తప్పనిసరి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, వర్షపు నీటిని సద్వినియోగపరిచే పద్ధతి లభించాలని, నీటి వృధాని అరికట్టాలని విద్యార్థులకు సూచించారు ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు నిర్మల, సేఫ్ వాటర్ నెట్వర్క్ ఇండియా ప్రతినిధులు జితేందర్ యాదవ్, టి వీరశేఖర్ , విద్యార్థినీ ,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈనెల 29న మాంస వ్యర్థాలకు వేలంపాట

- కమిషనర్ అమరేందర్ రెడ్డి



రంగారెడ్డి మార్చి 22 (మనం న్యూస్): తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని చికెన్ మరియు ఇతర మాంస వ్యర్థాల సేకరణకు ఈనెల 29న, బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు తుర్కయంజాల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొను వారు 20,000/- రూపాయల డి.డిని 'కమిషనర్ తుర్కయంజాల్ పురపాలక సంఘం' పేరిట చెల్లించి, సంబంధిత పత్రాలను ఈ నెల 28, లోపు సమర్పించాలని కోరారు. కనీస నిర్ణాయాక విలువ 05 లక్షల రూపాయలు ఉన్నట్లు నిబంధనలకు లోబడి వ్యర్థాలను స్వీకరించి, ప్రాసెసింగ్ పరిశ్రమలకు తరలించాలన్నారు, లేని యెడల వేలం రద్దు చేయబడుతుందన్నారు. వేలం పాటలో పాల్గొనువారు తుర్కయంజాల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 9966995842, 9014491650 మొబైల్ నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్ రెడ్డి, పారిశుద్ధ్య ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, పర్యావరణ ఇంజనీర్ హరీష్ మరియు జవాన్లు తెలిపారు.

# కవులకు సన్మానం



హైదరాబాద్, మార్చి 22(మనంన్యూస్): అంతర్జాతీయ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ పటాన్ చెరువు ఆధ్వర్యంలో పటాన్ చెరువులోని లయన్స్ భవనంలో పటాన్ చెరువు లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులైన లయన్ యం.జైపాల్ ముఖ్య అతిథిగా అంతర్జాతీయ కవిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రక్రియలలో రచనలు చేస్తున్న కవులు తల్లోజు యాదవాచారి,గుండం మోహన్ రెడ్డి,సుధాకర్ నమశివాయలు తమ,తమ కవితలను వినిపించారు. కవితా గానం అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ పటాన్ చెరువు పౌండర్ అధ్యక్షులు లయన్ యం.జయపాల్ అష్టావధాని తల్లోజు రాఘవాచారి,కవులు గుండం మోహన్ రెడ్డి ,సుధాకర్ నమ శివాయలను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తమను ఈ విధంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన లయన్స్ క్లబ్ పౌండర్ ఛైర్మేన్ లయన్ యం.జయపాల్ కు సన్మాన గ్రహీతలు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ 320డి జిల్లా ఛైర్మేన్ లయన్ బుక్కినేని వెంకటేశ్వర్లు, లయన్ ప్రతాప కృష్ణ గౌడ్ ,లయన్ డా.కిషన్, లయన్.యం.విశ్వనాథం, లయన్ కురుసాల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.రచయితలు వివిధ ప్రక్రియలలో రచనలు చేయడం ద్వారా సామాజిక సమస్యలను ఎత్తి చూపుతూ,పరిష్కార మార్గాలకు దిశా నిర్దేశం చేయాలని,ప్రజలలో చైతన్యం కల్పించడం ద్వారా సామాజిక అభివృద్ధికి దోహద పడాలని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయ పడ్డారు.

# కోర్టు ఆవరణలో కిరోసిన్ పోసుకున్న వ్యక్తి

**నిజామాబాద్ క్రైమ్, మార్చి 22(మనం న్యూస్):** జిల్లా కోర్ట్ ఆవరణలో ఓ వ్యక్తి కిరోసిన్ పోసుకున్న ఘటన కలకాలం రెప్పింది. శనివారం ఉదయం కోర్ట్ ఆవరణలో నర్సింగ్ అని వ్యక్తి చేతిలో కిరోసిన్ డబ్బా పట్టుకొని వచ్చాడు. తద్వారా తన ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యయత్నం చేశాడు. అక్కడే ఉన్న కోర్టు సిబ్బంది అప్రమతమై నర్సింగ్ అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడుతుండగా ప్రాణాపాయం జరగకుండా కాపాడడం జరిగింది. అనంతరం ఆత్మహత్యకు పాల్పడుతున్న వ్యక్తికి నిజామాబాద్ ఒకటో పోలీస్ స్టేషన్‌కు కోర్టు సిబ్బంది అప్పగించారు. ఈ సందర్భంగా ఆత్మహత్యకు పాల్పడుతున్న నర్సింగ్ అనే వ్యక్తి మాట్లాడుతూ తన తండ్రి వ్యవసాయ శాఖలో పనిచేస్తూ మృతి చెందడం జరిగిందని, అయితే కారుణ్య నియామకలో తనకు రావాల్సిన ఉద్యోగం నా సోదరుడు ఇబ్బంది పడుతున్నాడని ఇప్పించడం జరిగింది అన్నారు. తనకు ఉద్యోగం ఇప్పిస్తే కొంత డబ్బు ఇస్తానని నా సోదరుడు మాట ఇచ్చి ఇబ్బందులు గురి చేస్తున్నాడని ఆవేదనతో ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఆయన అన్నారు. నేను ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నానని ఉద్యోగం ఇప్పిచ్చిన తర్వాత నాకు డబ్బులు ఇయాల్సింది ఇవ్వకుండా చాలా ఇబ్బందులు గురి చేస్తున్నాడు కాబట్టి కోర్టు ఆవరణలో ఆత్మహత్య చేసుకుంటే న్యాయం జరుగుతుందని ఈ సంఘటనను పాల్పడినాలని ఆయన పోలీసులకు సూచించారు.






# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం



● **బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి**

**బోధన్, మార్చి 21 (మనం న్యూస్):** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తామని బోధన్ శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి అన్నారు శనివారం సాలుర మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయాన్ని ప్రారంభించారు. 90 మందికి కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్ని అడ్డంకులు వచ్చిన అరుపులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాను అందజేస్తామని అన్నారు. సంక్షేమ పథకాల అమలును కొందరు విమర్శలు చేస్తున్నారని అన్నారు. సాగు నీటిని పొదుపుగా వాడు కోవడం ద్వారా పంటలను కాపాడుకున్నామని వివరించారు. రైతులు వాణిజ్య పంటలు, ఆరు తడి పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఎ పి డి సాయి గౌడ్ గ్రంధాలయ చైర్మన్ అంతి రెడ్డి రాజిరెడ్డి, సహకార సంఘ అధ్యక్షులు రవి ,అల్లెజనార్ధన్, శరత్ పిసిసి డెలిగేట్ గంగా శంకర్, అల్లె రమేష్, కాంగ్రెస్ నాయకులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఓ మహిళ ఆత్మహత్యత్నం

**బాల్కొండ, మార్చి 22(మనం న్యూస్):** శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులో ఓ మహిళ దూకి ఆత్మహత్య యత్నం చేసుకున్న సంఘటన మెండోరా మండలంలో చోటుచేసుకుంది. శనివారం ఉదయం తన కొడుకును తీసుకొని నిర్మల్ భాగ్యనగర్ చెందిన శృతి శ్రీరామ్




సాగర్ ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యాయత్నా నికి పాల్పడింది. స్థానికులు గమనించి ఎస్ఐ నారాయణ కు సమాచారం అందించ గా ఘటన స్థలానికి చేరుకొని తల్లి కొడుకుల ను కాపాడి కుటుంబ సభ్యులు సభ్యులకు అప్పగించారు.

# పోలీస్ కమీషనర్ ఆకస్మికంగా తనిఖీలు

**నిజామాబాద్ క్రైమ్, మార్చి 22(మనం న్యూస్):** నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ గా నూతనంగా బాధితుల చేపట్టిన అనంతరం



మొట్టమొదటిసారిగా పలుచోట్ల శనివారం జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాదు పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య, ఈ దిగవ తెలిపిన కార్యాలయంలలో ఆకస్మికంగా పర్యవేక్షణ నిర్వహించడం జరిగిందన్నారు. అదేవిధంగాభరోసా సెంటర్,షీ టీమ్ కార్యాలయం, పోలీస్ ఫిల్లింగ్ స్టేషన్,సౌత్ రూరల్ ఆఫీస్ మొదలగు వాటిలో పర్యవేక్షణ చేయడం జరిగిందన్నారు అదేవిధంగా ఈ సందర్బంగా పోలీస్ కమీషనర్ కార్యాలయంలో రికార్డ్ లను చూసారు. అక్కడ గల సిబందితో క్షుణ్ణంగా అన్నీ వివరాలు అడిగితెలుసుకున్నారు. జిల్లా పోలీస్ కమిషనర్ తో పాటు సంబంధిత అధికారులు ఉన్నారు.

# ఈనెల 23న జిల్లాకు సీఎం రాక



**నిజామాబాద్ రూరల్, మార్చి 22(మనం న్యూస్):** జిల్లాలోని మోపాల్ మండలం నర్సింగ్ పల్లి లో గల ఇందూరు తిరుమల వార్షిక బ్రహ్మోత్సవలు కొనసాగుతున్నందుకు ఇందూరు తిరుమలలో జరిగే స్వామి వారి కళ్యాణానికి తెలంగాణ రాష్ట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 23న హాజరుకానున్నారు. ఆదివారం జరిగే స్వామివారి కల్యాణానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతున్నారని ఆలయ ప్రతినిధులు తెలిపారు. ఈ విషయమై భద్రత ఏర్పాట్లు గురించి అధికారులు పోలీసులు చర్చిస్తున్నట్టు తెలుస్తుంది. ఏ విధంగా భద్రత ఏర్పాటు చేయాలని వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో చర్చలు జరుగుతున్నాయి.

# ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్ పట్టివేత

**బోధన్, మార్చి 22 (మనం న్యూస్):** ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ను బోధన్ పట్టణ పోలీసులు పట్టుకున్నారు. సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం 9 గంటల సమయంలో మంజీర పరివాహక ప్రాంతం మందర్న నుండి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా అదుపులోకి తీసుకొని ట్రాక్టర్ ను ఠాణా కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



# పన్నులు చెల్లించక పోతే నల్లా కనెక్షన్ కట్




**బోధన్, మార్చి 22 (మనం న్యూస్):** ఆస్తి పన్ను వసూలుకు బోధన్ పురపాలక సంఘం అధికారులు చర్యలు చేపట్టారు. వంద శాతం బకాయిలు వసూలు చేసి బల్దియా ఆదాయాన్ని పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.పేరుకు పోయిన పన్ను బకాయిలు చెల్లించాలని నోటీసులు జారీ చేశారు. సంవత్సరాల తరబడి ఇంటి పన్నులు చెల్లించని వారి కుటుంబాలకు నీటి సరఫరా నిలిపి వేశారు. పన్నుల వసూలు లో ఎటువంటి మమకారం చూపవద్దని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి బల్దియా అధికారులను ఆదేశించడం తో అధికారులు సిబ్బందిని అప్రమత్తం చేశారు. శనివారం మున్సిపల్ యంత్రాంగం బకాయిలు ఉన్న దుకాణాలకు నోటీసులు జారీ చేశారు.

# 'గోల్ కార్డ్'కు భలే గిరాకీ.. ఒక్కరోజే 1000 విక్రయం!

**వాషింగ్టన్, మార్చి 22:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన 'గోల్ కార్డు'కు భారీ గిరాకీ ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కరోజే 1000 కార్డులను విక్రయించినట్లు వాణిజ్యశాఖ మంత్రి హోవర్డ్ లుట్నిక్ వెల్లడించారు. వీటి ద్వారా 5బిలియన్ డాలర్లు సేకరించామని చెప్పారు. ఓ పాడ్‌కాస్టోలో మాట్లాడుతూ.. లక్షలాది మంది ఈ కార్డును కొనేందుకు సిద్ధంగా ఉన్నారని, వీటిద్వారా 5 ట్రిలియన్ డాలర్లు సేకరించే అవకాశం ఉందన్నారు.

''ప్రపంచ వ్యాప్తంగా 3.7కోట్ల మందికి ఈ కార్డు కొనే సామర్థ్యం ఉంది. కనీసం 10లక్షల మంది దీనిని కొనుగోలు చేస్తారని అధ్యక్షుడు ట్రంప్ భావిస్తున్నారు'' అని లుట్నిక్ పేర్కొన్నారు. అసలు ఈ కార్డు ప్రవేశపెట్టాలన్న ఆలోచన ఎవరిదన్న ప్రశ్నకు బదులిస్తూ.. ట్రంప్ మదిలో నుంచి వచ్చిన ఆలోచనే అని చెప్పారు. అధ్యక్షుడి ఆలోచనను అమలు చేయడమే తన బాధ్యత అని, దీన్ని అమలు చేసే ప్రణాళిక తన వద్ద ఉందన్నారు.

ప్రస్తుతం ఉన్న పెట్టుబడి వీసా ఈబీ-5 స్థానంలో గోల్ కార్డు తీసుకురానున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల వెల్లడించిన సంగతి తెలిసిందే. 5 మిలియన్ డాలర్లు చెల్లించగలిగే వారికి నేరుగా అమెరికా



పౌరసత్వాన్ని అందజేస్తారు. ప్రపంచ వ్యాప్తంగా సంపన్నులను ఆకర్షించేందుకే దీనిని ప్రవేశపెట్టామని, వారు అమెరికాకు వచ్చి భారీగా ఖర్చుపెడితే స్థానికంగా ఉద్యోగాలు కూడా పెరుగుతాయని ట్రంప్ పేర్కొన్నారు.

ఇదే విషయంపై ఇటీవల మరో సందర్భంలో లుట్నిక్ మాట్లాడుతూ.. 2.5లక్షల మంది ఈ గోల్ కార్డు కొనేందుకు ఆసక్తి చూపుతున్నట్లు చెప్పారు. చట్టబద్ధ ఇన్వెస్టర్లకు పౌరసత్వం, శాశ్వత నివాసం కల్పించేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు.

ఈబీ-5 వీసా విధానాన్ని అమెరికా 1990లో తీసుకొచ్చింది. వేలాది మంది ఈ ఇన్వెస్టర్ వీసాలను పొందారు. అయితే, ఈ విధానంతో మోసాలు జరుగుతున్నాయని, కొందరు అక్రమంగా నిధులు పొందుతున్నారని ఇటీవల జరిపిన అధ్యయనంలో తేలింది. దీంతో 2022లో కొన్ని సవరణలు చేశారు. తాజాగా దీని స్థానంలో గోల్ కార్డును ప్రవేశపెడుతున్నట్లు ట్రంప్ ప్రకటించారు.

## జాతీయం- అంతర్జాతీయం

# హమాస్ మిలిటరీ ఇంటెలిజెన్స్ అధిపతిని హతమార్చాం: ఇజ్రాయెల్

**గాజా, మార్చి 22:** గాజాపై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో పశ్చిమాసియా మళ్లీ రణరంగంగా మారింది. ఈక్రమంలోనే టెల్‌అవీవ్ ఓ కీలక ప్రకటన చేసింది. హమాస్ మిలిటరీ ఇంటెలిజెన్స్ అధిపతిని తమ బలగాలు హతమార్చాయని పేర్కొంది. ఈమేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. దక్షిణ గాజాలో



ఒసామా తబాష్‌ను మా ఐడీఎఫ్ దళాలు హతమార్చాయని తెలిపింది. అతడు ఉగ్రవాద సంస్థ నిఘా, లక్ష్యాత్మక యూనిట్ విభాగానికి కూడా అధిపతిగా వ్యవహరిస్తున్నట్లు వెల్లడించింది. ఈ ప్రకటనపై హమాస్ ఇప్పటివరకు స్పందించలేదు. ఇటీవల ఇజ్రాయెల్- హమాస్‌ల మధ్య జరిగిన తొలిదశ కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన సంగతి తెలిసిందే. ఈ ఒప్పందం కొనసాగింపును ఉగ్రవాద సంస్థ తిరస్కరించింది. దీని కారణంగానే తాజాగా దాడులు జరిగాయని అమెరికా ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో పేర్కొంది. ఈ ప్రతిపాదనకు అంగీకరించినట్లయితే ఇలా జరిగేది కాదని పేర్కొంది. కాల్పుల విరమణ ఒప్పందం మార్పులను హమాస్ తిరస్కరించడంతోనే దాడులకు ఆదేశించానని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తెలిపారు. ఈ దాడులను తీవ్రంగా ఖండించిన హమాస్ ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని హెచ్చరించింది. హమాస్ బందీలను విడిచిపెట్టేవరకు గాజాలోని భూభాగాలను ఒక్కొక్కటిగా ఆక్రమిస్తామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ హెచ్చరికలు జారీ చేశారు. హమాస్ తలొగ్గితేనే తమ ఆక్రమణ ఆగుతుందని.. అప్పటివరకు సైన్యం మరిన్ని భూభాగాలను ఇజ్రాయెల్లో విలీనం చేస్తూనే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. బందీలు విడుదలయ్యే వరకూ సైన్యం ఒత్తిడి పెంచాలన్నారు. గాజా లేదా వెస్ట్‌బ్యాంకులోని భూభాగాలను ఆక్రమించుకోవడాన్ని ఫ్రాన్స్ తప్పుబట్టింది. రెండు దేశాలు ఒకదానిపక్కన ఒకటి శాంతితో నివసించాలని ఆ దేశ విదేశాంగ మంత్రి జీన్నోయెల్ బారెట్ పేర్కొన్నారు.

# తాత్కాలిక వలసదారులపై ట్రంప్ కొరడా.. 5 లక్షల మందికి హోదా రద్దు

**మియామీ, మార్చి 22:** అగ్రరాజ్య అధ్యక్షుడిగా ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటినుంచి వలసల విషయంలో అమెరికా సర్కారు దూకుడు నిర్ణయాలు తీసుకుంటోంది. ఇప్పటికే అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపి వారిని దేశం నుంచి పంపిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా తాత్కాలిక వలసదారులపైనా ట్రంప్ కన్నెర్ర చేశారు. యూఎస్ వ్యాప్తంగా 5 లక్షల మందికి పైగా వలసదారులకు తాత్కాలిక నివాస హోదాను రద్దు చేస్తున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ సంచలన ప్రకటన చేసింది.

క్యూబా, హైతీ, నికరాగ్వా, వెనెజువెలా దేశాలకు చెందిన లక్షలాది మంది వలసదారులకు చట్టపరమైన రక్షణను రద్దు చేస్తున్నట్లు హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం వెల్లడించింది. నెల రోజుల్లో వారిని దేశం నుంచి బహిష్కరించనున్నట్లు తెలిపింది. 2022 అక్టోబరు తర్వాత ఆ నాలుగు దేశాల నుంచి అమెరికాకు వలస వచ్చిన దాదాపు 5,32,000 మందికి ఈ ఉత్తర్వులు వర్తించనున్నాయి.

మానవత పెరోల్ కార్యక్రమం కింద అమెరికాకు వచ్చిన వారిపై ఈ కొత్త విధానం ప్రభావం చూపనుంది. వీరంతా ఇతరుల ఆర్థిక సహకారంతో అమెరికాకు వచ్చారని, రెండేళ్ల పాటు యూఎస్‌లో నివసించడానికి, పని చేయడానికి తాత్కాలిక అనుమతులు పొందారని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ వెల్లడించారు.

వీరు ఏప్రిల్ 24న లేదా ఫెడరల్ రిజిస్టర్‌లో నోటీసులు ప్రచురించిన 30 రోజుల తర్వాత అగ్రరాజ్యంలో ఉండేందుకు లభించిన లీగల్ స్టేటస్‌ను కోల్పోనున్నారని తెలిపారు.

మానవతా పెరోల్‌ను విస్తృతంగా దుర్వినియోగం చేస్తున్నారని, దీనికి ముగింపు పలుకుతామని ట్రంప్ ఇదివరకే వెల్లడించిన సంగతి తెలిసిందే. ఆ దిశగా తాజాగా అమెరికా సర్కారు చర్యలు చేపట్టింది. ఈ మానవతా పెరోల్ అనేది అమెరికాలో సుదీర్ఘకాలంగా ఉన్న వెసులుబాటు. యుద్ధం లేదా రాజకీయ అస్థిరత ఉన్న దేశాల ప్రజలు అమెరికాకు వచ్చి తాత్కాలికంగా నివాసం ఉండేందుకు వీలుగా అధ్యక్షుడు ఈ లీగల్ స్టేటస్‌ను కల్పిస్తారు. గతేడాది అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్ దీని గురించి పలుమార్లు ప్రస్తావించారు. అక్రమ వలసదారులను బహిష్కరించడంతో పాటు కొందరు వలసదారులకు ఉన్న చట్టబద్ధమైన మార్గాలను కూడా ముగిస్తామని అప్పట్లో తెలిపారు.

అంతక్రితం ఉన్న నిబంధనల ప్రకారం.. ఇలా మానవతా పెరోల్ కింద అమెరికాకు వచ్చే వారు రెండేళ్ల పాటు చట్టబద్ధంగా దేశంలో ఉపాధి పొందొచ్చు. ఆ గడువు ముగిసిన తర్వాత మరింత ఎక్కువ కాలం ఉండేందుకు వీలుగా శరణార్థిగా లేదా వీసా కోసం దరఖాస్తు చేసుకునే సౌలభ్యం ఉండేది. అయితే, ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దరఖాస్తుల ప్రక్రియను నిలిపివేశారు. దీన్ని సవాల్ చేస్తూ పలు ఫెడరల్ కోర్టుల్లో పిటిషన్లు దాఖలయ్యాయి.

# డాలర్‌ను బలహీనపరిచే ప్రయత్నం చేయలేదు: కేంద్ర మంత్రి

**ఢిల్లీ, మార్చి 22:** డాలర్‌ను బలహీనపరిచే ప్రయత్నం చేయలేదని విదేశాంగమంత్రి ఎస్. జైశంకర్ వెల్లడించారు. అటువంటి ప్రయత్నాల్లో తమ జోక్యం లేదని స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాలు డాలర్‌తో ఆటలు ఆడాలనుకుంటే



తాము వాణిజ్యంతో వారికి చెక్ పెడతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతంలో హెచ్చరించారు. ''బ్రిక్స్.. రెండు దశాబ్దాల కాలంగా సభ్యత్వం, ఎజెండా ఆధారంగా విస్తరిస్తోన్న వేదిక. అంతర్జాతీయ సమాజంలో బ్రిక్స్ కార్యకలాపాలపై అవగాహన పెంచేలా మా ప్రయత్నాలు ఉన్నాయి. ఈ కూటమి తన సభ్యుల ఉమ్మడి ఆందోళనను ప్రతిబింబిస్తుంది. ప్రపంచ దేశాలతో కలిసి ముందుకువెళ్తుంది. ఈ గ్రూప్ సమావేశాలు, చర్చలు ప్రపంచ క్రమాన్ని రూపొందించి, కలిసి పనిచేయడంపై లక్ష్యంగా ఉంటాయి. డాలర్ బలహీనపరిచే ప్రయత్నాల్లో, బ్రిక్స్‌కు కామన్ కరెన్సీని తీసుకురావడంలో భారత్ ప్రమేయం లేదు'' అని ట్రంప్ సుంకాల ముప్పు గురించి పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు జైశంకర్ సమాధానం ఇచ్చారు. డాలర్‌పై దాడి చేయడం భారతదేశ ఆర్థిక, రాజకీయ, వ్యూహాత్మక విధానంలో భాగం కాదని అమెరికాతో జరిపిన ద్వైపాక్షిక చర్చలలో భారత్ ఇదివరకే స్పష్టం చేసింది.

గతేడాది అక్టోబరులో రష్యాలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరిగిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో బ్రిక్స్ దేశాలు ఉమ్మడి కరెన్సీ రూపొందించడంపై దృష్టిసారించాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ పిలుపునిచ్చారు. ప్రస్తుతం కూటమిలోని దేశాలు డిజిటల్ కరెన్సీ వాడుకునేందుకు భారత్‌తో కలిసి రష్యా పని చేస్తోందన్నారు. సభ్య దేశాలు కొత్త ఆర్థిక సాధనాలను వినియోగించుకోవాలని పుతిన్ కోరారు. దీనిపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తున్నామన్నారు. కాగా అట్లాంటిక్ కౌన్సిల్‌కు చెందిన జియో ఎకనామిక్స్ సెంటర్ గత సంవత్సరం చేసిన అధ్యయనంలో బ్రిక్స్ దేశాలు ఎన్ని ప్రయత్నాలు చేసినా డాలర్‌పై ప్రపంచ దేశాలు ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గించలేవని వెల్లడించింది. ఈనేపథ్యంలో బ్రిక్స్ సభ్యులు డాలరుకు బదులు మరో కరెన్సీని తీసుకొస్తే ఆ దేశాలపై 100 శాతం సుంకం విధిస్తానని ట్రంప్ ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు చేశారు.

# అమెరికా చట్టాలకు కట్టుబడి ఉండండి

● **భారతీయ విద్యార్థులకు కేంద్రం సూచన**

**ఢిల్లీ, మార్చి 22:** అమెరికాలోని భారతీయ విద్యార్థులు అక్కడి చట్టాలకు కట్టుబడి ఉండాలని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శుక్రవారం సూచించింది. ఇటీవల ఇద్దరు భారతీయ విద్యార్థుల విషయంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఈ సూచన జారీ చేసింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అమెరికాలోని భారత ఎంబసీ, కాన్సులేట్ కార్యాలయాలు సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని పేర్కొంది. వీసాలు, వలస విధానాలపై నిర్ణయాలు పూర్తిగా ఆయా దేశాల విచక్షణాధికారానికి




సంబంధించినవని, వాటిని పాటించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని స్పష్టం చేసింది. వాషింగ్టన్ డీసీలోని జార్జ్‌టౌన్ యూనివర్సిటీలో పోస్ట్ డాక్టోరల్‌గా ఉన్న బదర్ఖాన్ సురి విశ్వవిద్యాలయంలో హమాస్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్నాడని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ సెక్యూరిటీ అధికారులు ఆరోపించిన సంగతి తెలిసిందే. దీంతో అతడి వీసాను రద్దు చేయడమే గాక.. గత సోమవారం వర్జీనియాలోని నివాసం నుంచి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అయితే తర్వాత అతడికి తాత్కాలిక ఉపశమనం లభించింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకు అతడి బహిష్కరణకు వీల్లేదని వర్జీనియా కోర్టు తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. అలాగే పాలస్తీనా అనుకూల నిరసనల్లో చురుగ్గా పాల్గొన్నందుకు భారతీయ విద్యార్థిని రంజనీ శ్రీనివాసన్ వీసా రద్దయిన విషయం విదితమే. తీవ్రవాద సంస్థ హమాస్‌కు మద్దతు తెలిపేలా ఆమె కార్యకలాపాలు ఉన్నాయని పేర్కొంటూ అమెరికా ఈ చర్య తీసుకుంది. వీసా ఈనెల 5న రద్దు కావడంతో ఆమె తనకు తానుగా అమెరికాను వీడారు. ఈ వరుస పరిణామాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. వారిద్దరూ సహాయం కోసం అమెరికాలోని భారత దౌత్య కార్యాలయాన్ని సంప్రదించలేదని విదేశాంగ శాఖ కార్యదర్శి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. '''విదేశీ పౌరులు భారతదేశానికి వచ్చినప్పుడు, వారు మన చట్టాలు, నిబంధనలకు కట్టుబడి ఉండాలని మనం ఆశిస్తాం. అదేవిధంగా భారతీయ పౌరులు విదేశాలలో ఉన్నప్పుడు వారు కూడా అక్కడి చట్టాలు, నిబంధనలను పాటించాలి'' అని ఆయన స్పష్టంచేశారు. ఇటీవల కాలేజీలు, స్కూళ్లు, యూనివర్సిటీలను ఉద్దేశంచి ట్రంప్ హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. ''చట్టవిరుద్ధ నిరసనలను అనుమతించే కాలేజీ, స్కూల్ లేదా యూనివర్సిటీలకు అన్ని ఫెడరల్ నిధులు నిలిపివేస్తా. ఆందోళనకారులను జైలుకు లేదా వారి స్వదేశానికి పంపించడం జరుగుతుంది. అమెరికా విద్యార్థులైతే శాశ్వత బహిష్కరణ లేదా కేసు తీవ్రతను బట్టి అరెస్టు ఉంటుంది. ఇందులో ఎటువంటి దాపరికం లేదు'' అని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఆ హెచ్చరికల ప్రభావం సురి, శ్రీనివాస్ప కనిపించింది.

# మూడునాళ్ల ముచ్చటే...

- ఆదివాసీ చిన్నారులకు అందని ప్రభుత్వ విద్య
- సొంత ఖర్చుతో పాఠశాల నడుపుతున్న గ్రామస్తులు

- మధ్యాహ్న భోజనానికీ దూరం
- చేతులెత్తేసిన విద్యాశాఖ



**చర్ల, మార్చి 22 (మనం న్యూస్):** ప్రభుత్వ విద్య తమకు అందుబాటులోకి వచ్చిందనే ఆనందం ఆదివాసీ చిన్నారులకు ఎంతో కాలం నిలవలేదు. ఊరు అటవీప్రాంతంలో ఉండటమే వారికి శాపంగా మారింది. వలస గ్రామమని రెవిన్యూ గ్రామం కాదని విద్యాశాఖ అధికారులు సెలవిచ్చారు. దీనికి తోడు గ్రామానికి పాఠశాలే లేనపుడు ఉపాధ్యాయులను ఎలా డిప్యూటేషన్ పై పంపిస్తారని ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం పెట్టడంతో విద్యాశాల అధికారులు డిప్యూటేషన్ పై వెళ్లిన ఉపాధ్యాయుడిని వెనక్కి పిలవడంతో ఆదివాసీ చిన్నారులకు ప్రభుత్వ విద్య మూడునాళ్ల ముచ్చటగానే మిగిలింది.చర్ల మండలం సుబ్బంపేట గ్రామ పంచాయతీ రాజయ్యనగర్, క్రాంతిపురం జంట గ్రామాలు. ఇక్కడ ఛత్తీస్ఘడ్ నుండి వలస వచ్చిన ఆదివాసీలు దశాబ్దంన్నర క్రితం స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. రెండు గ్రామాలలో కలిపి 50 కుటుంబాలు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. రిజర్వ్ ఫారెస్ట్ లో ఈ గ్రామాలు ఉండటంతో అటవీశాఖ అభ్యంతరం కారణంగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. రెండు గ్రామాలకు రహదారితో పాటు ప్రభుత్వ పాఠశాల లేదు. ఇక్కడ 22 మంది చిన్నారులు 1 నుండి 5 వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారు. వీరంతా ప్రతిరోజూ సుమారు మూడు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లి సుందరయ్య కాలని ప్రభుత్వ పాఠశాలకు గత ఏడాది అక్టోబర్ వరకు విద్యనభ్యసించారు. గ్రామం నుండి సుందరయ్య కాలని గ్రామం వెళ్లాలంటే అటవీప్రాంతం లోని కాలి బాట ద్వారానే వెళ్లాల్సి ఉంటుంది. అటవీ మార్గం కావడంతో తరచు విషసర్పాలు, నక్కలు, అడవి పందులు వంటి జంతువులు ఎదురవుతుండటంతో చిన్నారులతో వారి తల్లిదండ్రులు భయపడేవారు. ఈ క్రమంలో గత ఏడాది అక్టోబర్ లో చర్ల- వెంకటాపురం ప్రదాన రహదారిపై ఇసుక లారీ ఢీకొని ఇద్దరు చర్లలోని ఒక ప్రైవేటు పాఠశాలకు చెందిన విద్యార్థులు మృతిచెందారు. గ్రామం నుండి పాఠశాలకు వెళ్లాలంటే తప్పనిసరిగా ప్రదాన రహదారిని దాటాల్సి ఉంటుంది. సి కత్తిగూడెం, వీరాపురం ఇసుక ర్యాంపుల నుండి పదుల సంఖ్యలో లారీలు ఈ మార్గం ద్వారానే ప్రయానిస్తుండటంతో తల్లిదండ్రులు భయంతో తమ పిల్లలను పాఠశాలకు పంపించటం మాన్పించారు. విద్యార్ధులు పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండటంతో వారి భవిష్యత్ పాడవుతుందని గ్రామ పెద్ద రేగా ఆంద్రయ్య తన ఇంటినే పాఠశాలగా మలచి ఇంటి ఆవరణలోని రేకుల షెడ్డులో పాఠాలు బోదించడం ప్రారంబించారు. విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమవుతున్నారంటూ గత ఏడాది నవంబర్ 28 న 'పాపం పసివాల్లు' శీర్షికన 'మనం' లో వార్త కధనం ప్రచురితమైంది. వార్తకు స్పందించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అదికారి వెంకటేశ్వరాచారి అదే రోజు చర్లకు వచ్చి ఎంఈవో పరిటాల వెంకటరమణతో గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులు కోరిక మేరకు ఈ విద్యా సంవత్సరం వరకు సుబ్బంపేట ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఒక ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్ పై గ్రామానికి పంపించి చిన్నారులకు చదువులు చెప్పిస్తానని హామీ ఇచ్చారు. మరుసటిరోజే ఉపాధ్యాయులను గ్రామానికి పంపించి విద్యార్థుల సంఖ్యపై సర్వే నిర్వహించారు. అనంతరం ఒక ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్ పై పంపించి సంక్రాంతి సెలవుల వరకు పాఠాలు చెప్పించారు. ఈలోగా ఇది రెవిన్యూ గ్రామం కాదని, అసలు గ్రామంలో పాఠశాలే లేనపుడు ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్ పై ఎలా గ్రామానికి పంపిస్తారని ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేసాయి. దీంతో ఉపాధ్యాయుడి డిప్యూటేషన్ రద్దు చేసి వెనక్కి పంపించారు. దీంతో విద్యార్థుల పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఈ క్రమంలో గ్రామస్తులు, గ్రామంలోని క్రైస్తవ ప్రార్దనా మందిరం ఫాస్టర్స్ సహకారంతో పదవ తరగతి చదివిన యువతికి వేతనం చెల్లిస్తూ గ్రామ పెద్ద ఇంటి ముందు గల రేకుల షెడ్డులోనే పాఠాలను బోధిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న మద్యాహ్న భోజన పథకానికి ఈ చిన్నారులు నోచుకోకపోవడంతో దాతల సహకారంతో మద్యాహ్న భోజనం పెడుతున్నారు. బంగారు భవిష్యత్ ఉన్న చిన్నారులకు ప్రభుత్వ విద్య అందడం లేదనే బాద చిన్నారుల తల్లిదండ్రులలో వ్యక్తమవుతోంది. అనదికారికంగా ఇంటి వద్దనే నేర్పిస్తున్న విద్య వారికి ఎంత వరకు ఉపయోగపడుతుందని పెదవి విరుస్తున్నారు. 6 వ తరగతి చదువుకునేందుకు బయటి ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చినపుడు వీరు గతంలో చదివిన చదువును ఎలా గుర్తిస్తారనే ప్రశ్న తలెత్తు తోంది. ఐటిడిఏ ప్రాజెక్ట్ అదికారి తమ పిల్లల భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకొని వచ్చే విద్యా సంవత్సరం నుండి గ్రామానికి గిరిజన ప్రాదమిక పాఠశాలను మంజూరు చేయాలని గిరిజనులు కోరుతున్నారు. వచ్చే ఏడాది పాఠశాల మంజూరుకా కపోతే విద్యార్థుల భవిష్యత్ ఆగమ్యగోచరంగా మారే ప్రమాదం ఉంది. జిల్లా స్దాయి అదికారులు, ఐటిడిఏ పివో కలుగ చేసుకొని పాఠశాలను మంజూరు చేయాల్సిన అవసరం ఉన్నది.



**ఐటిడిఏ కు ప్రతిపాదనలు పంపాం : పరిటాల వెంకట రమణ, ఎంఇఓ**

రాజయ్యనగర్, క్రాంతిపురం గ్రామాలు రెవిన్యూ గ్రామాలు కావు. అక్కడ ఉపాధ్యాయ పోస్ట్ లేదు. డిప్యూటేషన్ పై ఉపాధ్యాయుడిని గ్రామానికి పంపడంతో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అందుకే ఉపాధ్యాయుడిని వెనక్కి పిలిపించాము. రెండు గ్రామాలు పూర్తి ఆదివాసీ గ్రామాలు కావడంతో గిరిజన ప్రాథమిక పాఠశాలను మంజూరు చేయాలని ఐటిడిఏ కు ప్రతిపాదనలు పంపాము.

**విద్యార్థుల భవిష్యత్ ఏమికాను: పూనెం జమ్ములు, రాజయ్య నగర్ వాసి, చర్ల**

ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొన్నాళ్లు గ్రామానికి వచ్చి పాఠాలు బోధించేవాడు. సంక్రాంతి సెలవుల తర్వాత రావడం లేదు. అప్పటి నుండి మేమే సొంతంగా ఒక ప్రైవేట్ ఉపాధ్యాయురాలిని చందాలు వేసుకొని నియమించుకొని విద్యార్థులకు చదువు చెప్పిస్తున్నాము. గ్రామానికి ఎటు చూసినా ప్రభుత్వ పాఠశాలలు దూరంగా ఉన్నందున ఇక్కడే ఐటిడిఏ పాఠశాలను మంజూరు చేయాలి.

# సీసీ రోడ్డు స్థలాన్ని అమ్మ లేదు

- అక్కడ పిఆర్ సిసి రోడ్డు ఉన్నమాట నిజమే
- పఠాన్ పాషా

**ఆళ్ళపల్లి, మార్చి 22 (మనం న్యూస్):** మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ కూడలి వద్ద మెయిన్ రోడ్డుకు ఆనుకుని గ్రామ పంచాయతీ రాజ్ సీసీ రోడ్డు రెండు కూడలిగా ఉండేది వాస్తవం అని పక్కన ఉన్న భూమి విక్రయ దారుడు పఠాన్ పాషా తెలిపారు. అందులో ఓ సీసీ రోడ్డు స్థలాన్ని ఇదే ఆళ్ళపల్లికి వలస వచ్చిన ఓ వ్యక్తికి అమ్మినానని వస్తున్న ఆరోపణలో నిజం లేదని అన్నారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆళ్ళపల్లి బస్టాండ్ సెంటర్ లో ప్రధాన రహదారికి రెండు వైపులా కలుస్తూ పీఆర్ సీసీ రోడ్లు రెండు ఉండేటివి వాస్తవం అని, ఆ రెండు పీఆర్ సీసీ రోడ్లు గత 30 సంవత్సరాలుగా ఉన్నది, దానికి ముందు 100 సంవత్సరాలకు పైనుంచి వెడల్పాటి గ్రావెల్ రోడ్డు ఉండేదన్న విషయం నాతో పాటు ఆళ్ళపల్లి వాసులందరికీ తెలుసన్నారు. నా కుటుంబ అవసరాల నిమిత్తం బస్టాండ్ సెంటర్ లో నా భార్యకు తన తల్లి ఇచ్చిన స్థలాన్ని ఆళ్ళపల్లికి చెందిన మొక్తియార్ హుస్సేన్ కు అమ్మింది వాస్తవం కానీ, ఆ రోజు కూడలిగా ఉన్న ఆ రెండు సీసీ రోడ్లు ఉండేవని, వాటిని వదిలి నాకున్నటువంటి ఇంటి స్థలాన్ని మొక్తియార్ హుస్సేన్ కు అమ్మడం జరిగిందని తెలిపారు. అంతేగానీ ఈ రెండు రోడ్ల పక్కన ఉన్న ఇంటి జాగ గతంలో రజకులైన బూరుగడ్డ ముసలయ్యకు ప్రభుత్వం ఇనాం భూమిగా ఇచ్చిందన్నారు. ఈ భూమికి పట్టా వేరే వారి పేరుపై బదిలీ చేయడం కుదరని వారు అన్నారు. వందల సంవత్సరాల క్రితం ఆళ్ళపల్లి రూట్ మ్యాప్ తీసి అప్పుడు బస్టాండ్ సెంటర్ లో జీపీ రోడ్డు ఒకటే ఉందని, ఇప్పుడు రెండు సీసీ రోడ్లు కూడలిగా ప్రధాన రహదారికి ఇరువైపులా కలిసి ఉంటే, వాటిలో ఓ సీసీ రోడ్డును తన సొంత జేసీబీలతో పగలగొట్టడం దారుణమన్నారు. పైగా ఆ రోడ్డు పై కొన్ని నెలల క్రితం మట్టి పోసి, ఇప్పుడేమో ఏకంగా ఇల్లు కట్టడానికి ప్రయత్నించడం పిల్లి కళ్లుమూసుకుని పాలు తాగిన చందంగా ఉందన్నారు. స్థానిక గత ప్రజా ప్రతినిధులు, సంబంధిత రెవెన్యూ, పంచాయతీ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా నాయకులు స్పందించి మండల ప్రజలకు ఉపయోగపడే ఆళ్ళపల్లి సీసీ రోడ్డు పగులగొట్టి మట్టిపోసి గుడెసె వేసిన ఎండీ మొక్తియార్ హుస్సేన్ పై కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ఉపాధి హామీ పథకం పని కోరే

- వారందరూ పనులకు హాజరు కావాలి
- కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 22 (మనంప్రతినిధి):** జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులకు పని కోరే ప్రతి ఒక్కరు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో పెద్ద ఎత్తున చేపడుతున్న పనులన్నిటిని త్వరితగతిన పూర్తి చేయడానికి గాను, పని కొరకు చూసే ప్రతి కూలి హాజరుకావాలని కలెక్టర్ కోరారు. ఉపాధి హామీ పథకం పనికోరు వారందరూ మార్చి 23 నుండి 29 వరకు వారం రోజులు వేగవంతంగా పనులు పూర్తి చేసేందుకు మరియు ఆర్థిక సంవత్సరం ముగింపు ఉన్నందున పనులు పూర్తి చేసేందుకు పెద్ద ఎత్తున కూలీలు హాజరుకావాలని కలెక్టర్ సూచించారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగపరచుకొని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామాలలో రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించి ప్రతి వ్యవసాయ భూమిలో ఫామ్ పౌండ్ నిర్మాణం చేపట్టాలని సూచించారు.బోర్ ద్వారా వ్యవసాయం చేసే ప్రతి రైతు వ్యవసాయ భూమిలో ఖచ్చితంగా నీటి గుంటల నిర్మాణం చేపట్టాల్సిందే అని కలెక్టర్ స్పష్టం చేశారు.

# గార్లలో చలివేంద్రం ఏర్పాటు



**గార్ల, మార్చి 22(మనం న్యూస్):** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గార్ల గ్రామ పంచాయతీ ఆద్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక నెహ్రూ సెంటర్ లో ఏర్పాటు చేసిన చలివేంద్ర కేంద్రాన్ని శనివారం పిఎసిఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ ఎంపిడిఒ మంగమ్మ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా పంచాయతీ ప్రజల దాహార్తిని తీర్చడానికి ఈ చలి వేంద్ర కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గార్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి అజ్మీరా కిషన్ నాయక్,ఇల్లందు మాజీ ఏఎంసి చైర్మన్ భూక్య నాగేశ్వరరావు, సిపిఎం జిల్లా నాయకులు కందునూరి శ్రీనివాస్,మండల కార్యదర్శి అలవాల సత్యవతి, వంగూరి వెంకటేశ్వర్లు,షేక్ యాకూబ్ పాషా, భూక్య రామ్ కుమార్,బిల్ కలెక్టర్ దాసు తదితరులు పాల్గొన్నారు.

# సదరన్ క్యాంప్ లో దివ్యాంగులకు అవసరమైన వసతుల కల్పన

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- నిర్ధారణ పరీక్షల తర్వాత యూ.డి.ఐ.డి. కార్డు జనరేట్
- సదరం క్యాంప్ ఏర్పాట్లపై కలెక్టర్ సూచనలు



**ఖమ్మం, మార్చి 22(మనం బ్యూరో):** సదరం క్యాంప్ నిర్వహణ సమయంలో దివ్యాంగులకు అవసరమైన వసతులను కల్పించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.శనివారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సదరం క్యాంప్ ల కోసం జిల్లా ప్రధాన ఆసుపత్రి వద్ద చేయవలసిన ఏర్పాట్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, శిక్షణా కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ దివ్యాంగులకు అందించే యూ.డి.ఐ.డి. కార్డులు మన రాష్ట్రంలో మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాలలో కూడా ఉపయోగపడతాయని, నూతనంగా యూ.డి.ఐ.డి. కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు ఆసుపత్రిలో నిర్ధారణ పరీక్ష కోసం సదరం స్లాట్ బుకింగ్ చేసి సమాచారం అందించాలని అన్నారు. దివ్యాంగులు నిర్ధారణ పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చినప్పుడు వారికి అవసరమైన వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఆసుపత్రిలో వికలాంగత్వం నిర్ధారణ కోసం అవసరమైన వైద్యులు, పరికరాలు ఉండేలా చూడాలని, క్యాంపు సమయంలో దివ్యాంగులకు రిసెప్షన్ సెంటర్, కుర్చీలు, నీడ కోసం ఏర్పాటు, త్రాగునీరు, టాయిలెట్స్, ర్యాంప్ వంటి వసతులు కల్పించాలని అన్నారు. నిర్ధారణ పరీక్షలు అనంతరం ప్రతి దివ్యాంగుడి యొక్క వైద్యులచే ధృవీకరించిన వైకల్య శాతంతో వివరాలను, దివ్యాంగులకు సంబంధించి ఇతర వివరాలు సంపూర్ణంగా యూ.డి.ఐ.డి. పోర్టల్ లో నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కిరణ్ కుమార్, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వర రావు, డిప్యూటీ సూపరింటెండెంట్ డా. కిరణ్ కుమార్, డా. రాంబాబు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకు వంట సామాగ్రి



**దమ్మపేట, మార్చి 22 (మనం న్యూస్):** ప్రభుత్వ ప్రైమరీ హై స్కూల్ నందు నిర్వహిస్తున్న మిడ్ డే మీల్స్ మధ్యాహ్నం భోజన పథకానికి అవసరమైనటువంటి వంట సామాగ్రిని గిన్నెలను దమ్మపేట మండలంలో ని విద్యా వనరుల విభాగ కేంద్రంలో ఎంఈఓ లక్ష్మి శనివారం అందజేశారు. దమ్మపేట మండల పరిధిలోని 68 ప్రభుత్వ హై స్కూల్, ప్రైమరీ పాఠశాలలకు సామాగ్రిని అందజేశారు.

## ఉపాధి హామీ పనుల

# లక్ష్యం పూర్తి చేయాలి



- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో

**మహబూబాబాద్, మార్చి 22(మనం ప్రతినిధి):** జిల్లాలో ఎన్ఆర్ఈజీఎస్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల లక్ష్యం పూర్తి చేయుటకు అందరు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ మొదటి అంతస్తులోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరము నుండి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు, పన్నుల వసూలు, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సంబంధిత సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కూలీల సంఖ్య పెంచి వంద రోజులు పని దినాలు కల్పించాలన్నారు. ప్రస్తుత ఎండాకాలం దృష్ట్యా ఉదయం 11 గంటల లోపు పనులు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. కూలీలకు తాగునీరు , ఓ ఆర్ ఎస్ అందుబాటులో ఉంచి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు, మార్చి 31 ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా ప్రభుత్వం సూచించిన నిబంధనలు ప్రకారము గ్రామపంచాయతీ మున్సిపల్ పరిధిలో ఇంటి పనులు నల్ల పన్నులు 100% వసూలు చేయాలని కోరారు. గ్రామాలు, మున్సిపల్ పరిధిలో అంతర్గత రోడ్లు పెండింగ్ పనులు తదితర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్ పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికి 25% సబ్సిడీ కల్పించి ఫీజు చెల్లించిన వారికి ప్రోసిడింగ్ కాపీలు మంజూరు చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిపిఓ హరిప్రసాద్, పంచాయతీరాజ్ ఈఈ విద్యాసాగర్, డి ఎల్ పి ఓ లు పుల్లారావు దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# సెంట్ ఫ్రాన్సిస్ స్కూల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**మధిర, మార్చి 22(మనం న్యూస్):** సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు స్కూలు ప్రిన్సిపాల్ సిస్టర్ ఆన్ బేబీ బేబీ,మెడల్స్, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రావిన్షియల్ సుపీరియల్ సిస్టర్ లిల్లీ కుట్టి,ఆర్సీఎం చర్చి ఫాదర్ శాంతి కుమార్, స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ సిస్టర్ మేరీ థామస్, స్కూల్ అకడమిక్ కోఆర్డినేటర్ వెంకటనారాయణ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ధరణిపై కలెక్టర్ సమీక్ష

**యాదగిరిగుట్ట, మార్చి 22 (మనం న్యూస్) :** యాదగిరిగుట్ట తాహశీల్దార్ కార్యాలయం ని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాహశీల్దార్ నాయబ్ మరియు సిబ్బంది తో సమీక్ష నిర్వహించారు. ధరణి ఇతర సంబంధిత పనులపై కార్యాలయంలోని సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధరణి పై సమావేశం నిర్వహించారు. ధరణి లో తప్పుడు రిపోర్ట్ పంపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమయపాలన పాటించని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తాసిల్దార్ కార్యాలయంలో పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.రిజిస్టేషన్ కి వచ్చిన రైతులతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు.మండల సర్వేయర్ వద్ద సర్వే కోసం ఉన్న అప్లికేషన్లను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. కోర్ట్ రిజిస్టర్ ని పరిశీలించారు. కుల ధ్రువీకరణ మరియు ఇతర సేవలను వెంటనే పరిష్కరించాలని, కళ్యాణ లక్ష్మి మరియు షాదిముబారక్ వంటి సేవలను వెంటనే పరిష్కరించాలని మీసేవ దరఖాస్తులు వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.



# యాదగిరిశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



**యాదగిరిగుట్ట, మార్చి 22 (మనం న్యూస్):** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దివ్య క్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వయంభులను మేల్కొల్పిన అర్చకులు గర్భగుడిలో కొలువు దీరిన స్వయంభులను సువర్ణ ప్రతిష్టమూర్తులను వేదమంతోత్సవములు, మంగళ వాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలలను అర్పించారు. ప్రాకారమంటపంలో సుదర్శన నరసింహ హోమం, నిత్య కళ్యాణం పండితులు ఘనంగా నిర్వహించారు భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని మొక్కలను చెల్లించుకున్నారు. సాయంత్రం స్వామివారి వెండి జోడు సేవలో స్వామివారిని అలంకరించి తిరువీధులలో ఊరేగించారు. కొండపైన అనుబంధ ఆలయం శ్రీ రామలింగేశ్వర శివాలయంలో నిత్య కైంకర్యాలను పండితులు నిర్వహించారు. పాత గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్య పూజలను పండితులు నిర్వహించారు. పతంజలి కూచిపూడి కళాక్షేత్రం (శ్రీ దేవరకొండ శ్రీనివాస రావు)(హైదరాబాద్)వారిచే కూచిపూడి నృత్య కార్యక్రమం నిర్వహించారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి వివిధ శాఖల నుండి వచ్చిన ఆదాయం 40,20,232 వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.





### ఇండియన్ ప్రీమియర్ లీగ్-2025

# తారలు దిగొచ్చిన వేళ.. అంగరంగ వైభవంగా..







ఇండియన్ ప్రీమియర్ లీగ్-2025 ఆరంభ వేడుకలు అట్టహాసంగా సాగాయి. కోల్కతాలోని ప్రఖ్యాత ఈడెన్ గార్డెన్స్ మైదానంలో బాలీవుడ్ సెలబ్రిటీలు తమ ఆట, పాటలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. డిఫెండింగ్ చాంపియన్ కోల్ కతా నైట్ రైడర్స్(కేకేఆర్) జట్టు సహ యజమాని, బాలీవుడ్ బాద్ షా షారుఖ్ ఖాన్ మైదానంలో సందడి చేశాడు. కేకేఆర్ కెప్టెన్ అజింక్య రహానే, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) సారథి రజత్ పాటిదార్ లతో కాసేపు ముచ్చటించాడు.

అనంతరం వేదికపైకి వచ్చి తనదైన శైలిలో ప్రసంగించాడు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ కలిగిన క్రికెట్ లీగ్ గా వెలుగొందుతున్న ఐపీఎల్ లో భాగం కావడం సంతోషంగా ఉందని షారుఖ్ హర్షం వ్యక్తం చేశాడు. ఆ తర్వాత ప్రముఖ సింగర్ శ్రేయా ఘోషల్ తన గాత్రంతో ప్రేక్షకులను సమ్మోహనపరిచింది. హిందీ పాటలతో పాటు పుష్ప-2 సినిమాలోని పాపులర్ సాంగ్ ..''సూసేకి అగ్గిరవ్వ మాదిరి ఉంటాడే నా సామీ''.. తెలుగులో పాడటం విశేషం.ఆ తర్వాత స్టార్ హీరోయిన్ దిశా పటానీ హుషారైన స్టెప్పులతో అభిమానులను ఉర్రూతలూగించింది.

ఆ తర్వాత టీమిండియా, ఆర్సీబీ సూపర్స్టార్ విరాట్ కోహ్లిని షారుఖ్ స్టేజీ మీదకు ఆహ్వానించాడు. కోహ్లితో ముచ్చటించిన అనంతరం.. కేకేఆర్ యువ తార రింకూ సింగ్ ను కూడా వేదిక మీదకు పిలిచాడు. ముగ్గురూ కలిసి కాసేపు స్టెప్పులు వేశారు. అనంతరం బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీతో పాటు ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, కార్యదర్శి దేవజిత్ సైకియా, ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ లను వేదిక మీదకు ఆహ్వానించగా... ఐపీఎల్-18 కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.




### సాల్ట్, కోహ్లి విధ్వంసం..

# కేకేఆర్‌ను చిత్తు చేసిన ఆర్సీబీ

ఐపీఎల్-2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు శుభారంభం చేసింది. ఈ టోర్నీలో భాగంగా ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్ కతా నైట్ రైడర్స్ తో జరిగిన తొలి మ్యాచ్ లో 7 వికెట్ల తేడాతో ఆర్సీబీ ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్లో తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. ఆరంభంలోనే క్వింటన్ డికాక్ వికెట్ కోల్పోయినప్పటికి కేకేఆర్ కెప్టెన్ అజింక్య రహానే(31 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్ లతో 56), సునీల్ నరైన్(26 బంతుల్లో 44) అద్భుతమైన ఇన్నింగ్స్ లు ఆడారు. వీరితో పాటు రఘువంశీ(30) పరుగులతో రాణించాడు. డికాక్ తో పాటు వెంకటేశ్ అయ్యర్(6), అండ్రీ రస్సెల్(4), రింకూ సింగ్(12) తీవ్ర నిరాశపరిచారు. ఆర్సీబీ బౌలర్లలో కృనాల్ పాండ్యా మూడు వికెట్లతో సత్తాచాటగా.. హాజిల్ వుడ్ రెండు, రసీఖ్ ధార్ సలీం, యశ్ దయాల్ తలా వికెట్ సాధించారు.

**కోహ్లి, సాల్ట్ విధ్వంసం..**

175 పరుగుల లక్ష్యాన్ని ఆర్సీబీ కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి 16.2 ఓవర్లలో ఛేధించింది. ఆర్సీబీ బ్యాటర్లలో విరాట్ కోహ్లి(59 నాటౌట్) టాప్ స్కోరర్ గా నిలవగా.. ఫిల్ సాల్ట్(31 బంతుల్లో 56), పాటిదార్(16 బంతుల్లో 34) మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. పవర్ ప్లేలో కోహ్లి, సాల్ట్ చాలా దూకుడుగా ఆడారు.

వీరిద్దరి విధ్వంసం ఫలితంగా ఆర్సీబీ స్కోర్ ఆరు ఓవర్లలోనే 80 పరుగులు దాటేసింది. ఇక కేకేఆర్ బౌలర్లలో వరుణ్ చక్రవర్తి, వైభవ్ అరోరా,సునీల్ నరైన్ తలా వికెట్ సాధించారు. ఆర్సీబీ స్టార్ ఆల్ రౌండర్ కృనాల్ పాండ్యాకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.



## మెరిసిన 'లక్ష్య' స్వరాజ్, శిరీష



ఈనాడు 'లక్ష్య' అథ్లెట్లు అంబటి స్వరాజ్, జి.శిరీష సత్తా చాటారు. ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న ఖేలో ఇండియా పారా క్రీడల్లో శుక్రవారం బాలుర 100 మీటర్ల టీ11 విభాగంలో స్వరాజ్ రజతం గెలిచాడు. అతడు 13.18 సెకన్లలో లక్ష్యాన్ని చేరి రెండో స్థానంలో నిలిచాడు. బాలికల 100 మీటర్ల టీ11 కేటగిరిలో శిరీష 16.55 సెకన్లలో రేసు పూర్తి చేసి రజతం సొంతం చేసుకుంది. అంధులైన స్వరాజ్, శిరీష హైదరాబాద్లోని నేత్ర విద్యాలయ జూనియర్ కళాశాలలో చదువుతున్నారు.

# నాకు ఇష్టమైన స్థలం తిరుమల

### టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్



తిరుమల, మార్చి 22,మనం న్యూస్: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ప్రపంచ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ తన పుట్టిన రోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలసి శనివారం ఉదయం స్వామివారి నైవేద్య విరామ సమయం అనంతరం శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు దర్శనం అనంతరం రంగనాయక మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా టీటీడీ అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపల తనను కలిసిన పత్రికా ప్రతినిధులతో నైనా జైస్వాల్ మాట్లాడుతూ నా పుట్టినరోజు సందర్భంగా తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి తిరుమలకు వచ్చానని పుట్టినరోజు సందర్భంగా శ్రీవారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ప్రపంచంలోనే నాకు ఎంతో అత్యంత ఇష్టమైన స్థలం కలియుగ దైవం కొలువై ఉన్నటువంటి తిరుమల క్షేత్రం అని అన్నారు. ఎందుకంటే ప్రతిసారి తిరుమలకు వచ్చి స్వామి వారిని దర్శించుకోవడం వలన నాకు కొండంత ధైర్యం వస్తుందని అన్నారు. శ్రీవారి దర్శనార్థం తిరువులకు వచ్చిన భక్తులందరూ కూడా చాలా అదృష్టవంతులని స్వామివారిని దర్శించుకుంటే అంధకార బంధురమైన కలియుగమున గతి తప్పిన మానవ జన్మనికి సూర్యుని వెలుగు లాంటిది ఈ తిరుమల క్షేత్రంలో శ్రీవారిని దర్శించుకోవడం అని నేను మనస్ఫూర్తిగా చెప్పగలనని అన్నారు. ప్రస్తుతానికి యూరప్ దేశంలో జరిగే స్లో వేనియా ఓపెన్ గురించి కసరత్తు చేస్తున్నానని అక్కడ కూడా స్వామివారి ఆశీస్సులతో మీ అందరి అభిమానంతో మంచి ఆట తీరు కనబరుస్తానని అన్నారు.



## 'టాక్సిక్' రిలీజ్ డేట్ ఫిక్స్

రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్టైనర్ మూవీ 'టాక్సిక్' కోసం పాన్ ఇండియా ఆడియెన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాను గీతూ మోహన్దాస్ డైరెక్ట్ చేస్తుండగా భారీ క్యాస్టింగ్ ఈ సినిమాలో నటిస్తున్నారు. ఇక ఇప్పటికే రిలీజ్ అయిన ఈ మూవీ పోస్టర్స్, వర్కింగ్ స్టిల్స్ ఈ చిత్రంపై అంచనాలను పెంచాయి.

అయితే, తాజాగా ఈ చిత్రం నుంచి ఓ బిగ్ అప్డేట్ ను మేకర్స్ రివీల్ చేశారు. టాక్సిక్ చిత్రాన్ని పాన్ ఇండియా లెవెల్ లో మార్చి 19, 2026లో గ్రాండ్ రిలీజ్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈమేరకు తాజాగా ఓ కొత్త పోస్టర్ తో ఈ రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేశారు. 2026 ఉగాది కానుకగా ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.

ఇక ఈ సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్మెంట్ తో ప్రేక్షకుల్లో టాక్సిక్ మూవీపై అంచనాలు అమాంతం మరోసారి పెరిగిపోయాయి. ఇక ఈ సినిమాలో నయనతార, హుమా ఖురేషి, కియారా అద్వానీ, తారా సుతారియా, అచ్యుత్ కుమార్ తదితరులు నటిస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లు సంయుక్తంగా ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తున్నాయి.

# మీరు లేకుండా నేను లేను సమంత



''సాధారణంగా హీరో లేదా హీరోయిన్లకు తాము నటించిన సినిమా హిట్ అయితేనే అభిమానం, ప్రేమ చూపేవారు ఎక్కువ ఉంటారు. కానీ, గత రెండేళ్లుగా నేను ఒక్క తమిళ సినిమా కూడా చేయలేదు. పైగా ఇటీవల నా ఖాతాలో ఏ హిట్ మూవీ లేదు. అయినా నాపై మీ (అభిమానులను ఉద్దేశించి) ప్రేమ, అభిమానం ఏమాత్రం తగ్గలేదు. మీ అభిమానం, ప్రేమ చూస్తుంటే మాటలు రావడం లేదు. మీ నుంచి ఈ స్థాయిలో ప్రేమాభిమానాలు పొందేందుకు నేను ఏం చేశానో కూడా అర్థం కావడం లేదు. ఏది ఏమైనా మీరు లేకుండా నేను లేను... మీ వల్లే ఈ స్థాయిలో ఉన్నాను'' అని సమంత అన్నారు. స్ఫూర్తిదాయక పాత్రల్లో ఆడియన్స్ని ఎంటర్టైన్ చేస్తున్నందుకు 'కె. బాలచందర్ హాల్ ఆఫ్ ఫేమ్' అవార్డుతో చెన్నైలో జరిగిన 'బిహైండ్ వుడ్స్ అవార్డ్స్' వేడుకలో సమంతను సత్కరించారు నిర్వాహకులు. ఈ వేదికపై సమంత మాట్లాడుతూ-''కె. బాలచందర్ సార్ అవార్డు అందుకోవడం చాలా ఆనందం గా ఉంది. ఆయన సినిమాల్లో మహిళల పాత్రలు ఎంతో సహజంగా ఉంటాయి. ఆయన నుంచి నేనెంతో స్ఫూర్తి పొందాను. అలాంటి బాలచందర్ సార్ అవార్డుని అందుకోవడంతో నా జీవితం పరిపూర్ణం అయినట్లు భావిస్తున్నాను. ఈ అవార్డుకు నన్ను ఎంపిక చేసినవారికి కృతజ్ఞతలు'' అని తెలిపారు. ఈ అవార్డు మాత్రమే కాదు... 'సిటాడెల్: హనీ బన్నీ' టీవీ సిరీస్ కిగాను ఉత్తమ నటి అవార్డును కూడా సమంతకు ప్రదానం చేశారు. ఇదిలా ఉంటే... 2022లో విడుదలైన 'కాత్తు వాక్కుల రెండు కాదల్' తర్వాత ఆమె తమిళంలో ఏప్రాజెక్ట్ కు ఓకే చెప్పలేదు. అలాగే తెలుగులో 'ఖుషి' (2023) సినిమా తర్వాత మరో చిత్రంలో నటించలేదు సమంత. ప్రస్తుతం ఆమె 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్డమ్' అనే వెబ్ సిరీస్ చేస్తున్నారు.

# హీరోలకు మాకూ అదే తేడా పూజాహెగ్డే



సినిమా సెట్స్ లో తనకూ వివక్ష ఎదురైనట్లు కథానాయిక పూజాహెగ్డే తెలిపింది. తెలుగుతో పాటు, తమిళ, హిందీ భాషల్లో అగ్ర కథానాయకుల సరసన నటించిన పూజా స్టార్ హీరోయిన్ గా కొనసాగుతున్నారు. ఒకప్పుడు వరుస అవకాశాలను అందిపుచ్చుకున్న ఆమె ప్రస్తుతం స్క్రిప్ట్ ల ఎంపిక విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తోటి నటుల కారణంగా ఎప్పుడైనా ఇబ్బంది పడ్డారా? అన్న ప్రశ్నకు స్పందిస్తూ ''ఇది అన్ని పరిశ్రమల్లోనూ ఉంది. అయితే, ఒక్కో చోట ఒక్కోరకంగా ఉంటుంది. పరిస్థితులను బట్టి దాని స్థాయిలు మారిపోతూ ఉంటాయి. ఉదాహరణకు హీరో వ్యానిటీ వ్యాన్ మూవీ షూటింగ్ జరిగే సెట్ కు పక్కనే నిలిపి ఉంచుతారు. మిగిలిన వాళ్లవి దూరంగా ఉంటాయి. మేము బరువైన కాస్ట్యూమ్స్, భారీ లెహంగాలు ధరించి సెట్ వరకూ నడుచుకుంటూ రావాలి. కొన్నిసార్లు అది చూడటానికి బాగున్నా, అంత బరువైన దుస్తులను ఈడ్చుకుంటూ వచ్చి, షాట్ అయ్యాక అలాగే వెళ్లాల్సి ఉంటుంది. ఇదొక రకమైన వివక్ష'' ''ఇంకొన్ని సార్లు పోస్టర్ లో మా పేరు కూడా ఉండదు. లవ్ స్టోరీలో నటించినా ఎలాంటి గుర్తింపు ఇవ్వరు. సినిమా అనేది సమష్టి కృషి అన్న విషయం అందరూ గుర్తించాలి. అందరూ నా అభిమాన హీరోలే. అయితే, అనుష్కశర్మ అంటే నాకెంతో ఇష్టం. ఎందుకంటే ఆమె వ్యక్తిత్వానికి నేను దగ్గరగా ఉంటా. ఒకప్పుడు ఇండస్ట్రీలో ఆమెకు ఎలాంటి సపోర్ట్ లేదు. ఆమెలానే నాక్కూడా పార్టీలంటే ఇష్టం ఉండదు. 'అచ్చం నాలాంటి వారు ఒకరు ఉన్నందుకు సంతోషం' అనిపిస్తుంది. హాలీవుడ్ లో స్కార్లెట్ జాన్సన్ అంటే ఇష్టం'' అని పూజా హెగ్డే చెప్పుకొచ్చింది. దశాబ్దాలుగా అగ్ర కథానాయకులుగా కొనసాగుతూ భారీ పారితోషికం అందుకుంటున్న వారితో కలిసి నటించినా, తనని తాను రెండో తరగతి పౌరురాలిగానే చూసుకుంటానని తెలిపింది. అలాగే, హీరోయిన్లు భారీ పారితోషికం అందుకుంటున్నారంటే ముందుగా సంతోషపడేది తానేనని చెప్పుకొచ్చింది.ఇక పూజా సినిమాల విషయానికొస్తే, గతేడాది ఆమె అసలు తెరపైనే కనిపించలేదు. ప్రస్తుతం ఆమె వరుస చిత్రాలు చేస్తున్నారు. ఈ ఏడాది షాహిద్ కపూర్ 'దేవ'లో కనిపించింది. ప్రస్తుతం సూర్యతో 'రెట్రో', లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ', రాఘవ లారెన్స్ 'కాంచన4' సహా విజయ్ తో కలిసి 'జన నాయగన్'లో పూజా నటిస్తోంది.

## హద్దులు దాటి అసభ్యంగా.. కరెక్ట్ కాదు!



హీరోయిన్లు చాలామంది సినిమా అవకాశాల కోసం ఎదురుచూస్తుంటారు. ఈ క్రమంలో ఛాన్సుల్ని అందుకునే విషయంలో పలు సవాళ్లు ఎదురవుతుంటాయి. కానీ నిధి అగర్వాల్ కి మాత్రం తొలి మూవీ చేసేటప్పుడు వింతైన కండీషన్ పెట్టారట. అది చూసి ఈమె షాకైందట. ''మున్నా మైకేల్' మూవీతో నా కెరీర్ మొదలైంది. ఇదో బాలీవుడ్ మూవీ. టైగర్ ష్రాఫ్ హీరో.
ఈ సినిమాకు ఓకే చెప్పిన తర్వాత నాతో ఓ కాంట్రాక్ట్ పై సంతకం చేయించారు. అందులో నో డేటింగ్ అనే కండీషన్ కూడా ఉంది. అంటే సినిమా పూర్తయ్యేవరకు హీరోతో నేను డేటింగ్ చేయకూడదనమాట. కాంట్రాక్ట్ మీద సంతకం పెడుతున్నప్పుడు ఇవన్నీ గమనించలే గానీ తర్వాత వీటి గురించి తెలిసి ఆశ్చర్యపోయాను' అని నిధి అగర్వాల్ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం తెలుగులో హరిహర వీరమల్లు, రాజాసాబ్ సినిమాలు చేస్తున్న నిధి.. ట్రోలింగ్ గురించి కూడా మాట్లాడింది. 'మంచి, చెడు చెప్పడానికి పద్ధతి ఉంది. హద్దులు దాటి అసభ్యంగా మాట్లాడటం మాత్రం సరికాదు. నేను అస్సలు ఇలాంటివి పట్టించుకోను' అని నిధి చెప్పుకొచ్చింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.